
TGTEL/25/A4103

# తెలంగాణవీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




epaper.telanganaveena.in | హైదరాబాద్ | ఎడిటర్ : కె. శ్రీనివాస్ | సంపుటి:01 సంచిక:143 శుక్రవారం 05 జూన్ 2026 | పేజీలు : 08 | వెల: రూ. 3/-

### పాలమూరు ప్రాజెక్టులపై

# సీఎం రేవంత్ సమీక్ష

## పలు ప్రాజెక్టులను ఏరియల్ సర్వే చేసిన సీఎం

## ప్రాజెక్టుల స్థితిగుతలపై అధికారులతో ఆరా



**మహబూబ్‌నగర్,జూన్4(తెలంగాణ వీణ):**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమశిలలో ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ జిల్లా పరిధిలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా ఏరియల్ సర్వే నిర్వహించారు. ముఖ్యమంత్రి , మంత్రుల బృందం పాలమూరు జిల్లాలోని పలు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను ఆకాశ మార్గం ద్వారా క్షుణ్ణంగా పరిశీలించింది. ముఖ్యంగా కోయిల్ సాగర్ ప్రాజెక్టు, కృష్ణా-భీమా నదులపై ప్రతిపాదించిన నూతన బ్యారేజీల స్థలాలు, , జూరాల ప్రాజెక్టు డ్యామ్‌ను సీఎం రేవంత్ రెడ్డి వీక్షించారు. ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు, నీటి నిల్వ సామర్థ్యం తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గ పరిధిలోని కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిని ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ పథకంలో అత్యంత కీలకమైన కాట్రేవుపల్లి పంప్ హౌస్ వద్ద జరుగుతున్న పనుల నిర్మాణ శైలిని, పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వీక్షించారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించడంలో ఈ ప్రాజెక్టు ఎంతో కీలకం కానుండటంతో దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఏరియల్ సర్వే అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంత్రుల బృందం కూడా ప్రాజెక్టుల వారీగా ఉన్న అడ్డంకులను తొలగించి, పనులను త్వరగా ముగించాలని అధికారులకు సూచించింది.



## రాహుల్ 'ఆర్థిక సునామీ' వ్యాఖ్యలు...

### భయాన్ని సృష్టించవద్దని బీజేపీ హెచ్చరిక

- దేశంలో ఆర్థిక సునామీ తప్పదని రాహుల్ గాంధీ హెచ్చరిక
- ఇది కేవలం భయాన్ని సృష్టించడమేనని తిప్పికొట్టిన బీజేపీ
- దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని పలు గణాంకాలు విడుదల
- ఎమర్జెన్సీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ గత చరిత్రను గుర్తుచేసిన నేతలు

దేశంలో త్వరలో 'ఆర్థిక సునామీ' రాబోతోందని, ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను ప్రకటించవచ్చని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఇవి కేవలం ప్రజల్లో భయాన్ని సృష్టించే ప్రయత్నాలని, భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ సవాళ్లను తట్టు కుని పటిష్ఠంగా ఉందని స్పష్టం చేసింది.

## అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

- కేఎస్టార్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు
- ఆస్తి, ప్రాణనష్టంపై అందని వివరాలు
- రంగంలోకి దిగిన ఫైర్ ఇంజన్లు, పోలీసులు
- అమీర్‌పేట-ఎస్టార్ నగర్ మధ్య ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

**హైదరాబాద్,జూన్4(తెలంగాణ వీణ):**

హైదరాబాద్ అమీర్‌పేటలో గురువారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. శ్రీనివాసనగర్ వెస్ట్‌లో, మెట్రో పిల్లర్ నంబర్ - 1043 సమీపంలో ఉన్న కేఎస్టార్ ఫ్యాషన్స్ దుకాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా మంటలు భారీగా ఎగసిపడ్డాయి. దీంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.



## నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు

## ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణం: తలసాని

**హైదరాబాద్,జూన్4(తెలంగాణ వీణ):**

అగ్నిప్రమాదాలను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం అమీర్ పేటలోని మైత్రివనం వద్ద అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. ప్రమాదం వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంతో నష్టపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు, కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా అగ్నిమాపక శాఖకు అవసరమైన ఆధునిక పరికరాలు అందుబాటులో కి తేవాలని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో స్పందించిన అధికారులను ఆయన అభినందించారు. ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

## చంచల్‌గూడ జైల్లో బాల్క సుమన్‌ను కలిసిన కేటీఆర్

- సింగరేణి ఆస్తులను ధ్వంసం చేయాలంటూ బాల్క సుమన్ వ్యాఖ్యలు
- చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సుమన్
- కేటీఆర్‌తో పాటు జైలుకు వెళ్లిన తలసాని, సుధీర్ రెడ్డి



చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు ములాఖత్‌లో కలిశారు. కేటీఆర్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సుధీర్ రెడ్డి కూడా బాల్క సుమన్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు. జైల్లో ఉన్న సుమన్‌కు పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు.

**అసలు కేసు నేపథ్యం ఏంటి?**

సింగరేణి కాలరీస్ ఆస్తులను ధ్వంసం చేయాలంటూ, రైలు పట్టాలు కోసేయాలంటూ బాల్క సుమన్ ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఆయనపై నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ...మిగతా 2 లో...



## ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి డిమాండ్

**జగిత్యాల,జూన్4తెలంగాణ వీణ:**

రాష్ట్ర ప్రజానికంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆరోపి ంచారు. వానకాలం పంట సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభమవుతున్నా గాని ప్రభుత్వానికి ముందస్తు కార్య చరణ ప్రణాళికను ఇంకా తయారు చేసుకోలేదని వెల్లడించారు.

...మిగతా 2 లో...

## మమతకు భారీ షాక్:

### బీజేపీ వైపు 20 మంది టీఎంసీ ఎంపీల చూపు!

- టీఎంసీలో తీవ్రరూపం దాల్చిన సంక్షోభం
- ప్రతిపక్ష నేతగా రెబల్ ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీకి గుర్తింపు
- బీజేపీతో టచ్‌లో 20 మంది టీఎంసీ ఎంపీలు ఉన్నట్లు ఊహాగానాలు
- మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై అసంతృప్తితోనే తిరుగుబాటు
- బెంగాల్‌లో పార్టీ కమిటీలన్నింటినీ రద్దు చేసిన టీఎంసీ



పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ చరిత్రలోనే అతిపెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మొదలైన అసమ్మతి, ఇప్పుడు ఎమ్మెల్యేల తిరుగుబాటుతో తీవ్రస్థాయికి చేరింది. ఈ సంక్షోభం రాష్ట్రానికే పరిమితం కాకుండా, ఢిల్లీకి కూడా పాకింది. ఏకంగా 20 మంది లోక్‌సభ సభ్యులు పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలు మమతా బెనర్జీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.జూన్ 3న, పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీని ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ గుర్తించారు.

...మిగతా 2 లో...

## మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు

- నేటి నుంచే అమల్లోకి పెంచిన రేట్లు
- రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం
- సబ్ రిజిస్ట్రార్ల అధికారాలకు కత్తెర
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,జూన్4తెలంగాణ వీణ:**

మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు శుక్రవారం నుంచి పెరుగుతాయని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూముల ధరలు ఏరియాను బట్టి 50 నుంచి100 శాతం పెరుగుతాయని తెలిపారు. ప్రైమ్ ఏరియాలో 100 శాతం పెరుగుతాయన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. భూముల వ్యాల్యూ పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం వస్తుందని చెప్పారు. హయ్యర్ సైడ్ ఏరియాలు శేరిలింగంపల్లి, రాజేందర్ నగర్, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగవన్నారు. ఆయా ప్రాంతాల్లో ఛార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఇక నుంచి సబ్ రిజిస్ట్రార్లకు ఫుల్ పవర్స్ కట్ చేశామని.. వారికి మినిమమ్ పవర్స్ మాత్రమే ఉంటాయని మంత్రి పొంగులేటి వివరించారు. భూ సేకరణ సమయంలో ప్రభుత్వానికి కొంత నష్టం జరిగిందన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం...



### ఉద్యమకారుల సంఘాలను కలిసి వివరాలు సేకరిస్తాం అఖిలపక్ష భేటీలో కమిటీ చైర్మన్ కేశవరావు

**హైదరాబాద్,జూన్4తెలంగాణ వీణ:**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కె. కేశవరావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీతో గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేకే మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తామని అన్నారు. అందుకోసం ఉద్యమకారులందరినీ పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని వివరించారు.

...మిగతా 2 లో...

మొదటిపేజీ తరువాయి

# అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

**హైదరాబాద్,జూన్4(తెలంగాణ వీణ):**

హైదరాబాద్ అమీర్‌పేటలో గురువారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. శ్రీనివాసనగర్ వెస్ట్‌లో, మెట్రో పిల్లర్ నంబర్ - 1043 సమీపంలో ఉన్న కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా మంటలు భారీగా ఎగసిపడ్డాయి. దీంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. మంటలు వేగంగా వ్యాపించకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దట్టమైన పొగ కారణంగా పరిసర ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. భవనంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు కూడా కొనసాగాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయంపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం కారణంగా అమీర్‌పేట నుంచి ఎస్సార్ నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పరిసర ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఇతర మార్గాల వైపు మళ్లిస్తూ పరిస్థితిని నియంత్రించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు, వాహనదారులు అమీర్‌పేట- ఎస్సార్‌నగర్ మార్గాన్ని తాత్కాలికంగా నివారించి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని అధికారులు సూచించారు. అలాగే విధుల్లో ఉన్న ట్రాఫిక్, అగ్నిమాపక సిబ్బంది, ఇతర అత్యవసర సేవల సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

మొదటిపేజీ తరువాయి

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం...

ఈ అఖిల పక్షం సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులతో, ఉద్యమకారుల సంఘాలతో అనుబంధం ఉన్న వారిని మళ్లీ కలుస్తామని కె.కేశవరావు తెలిపారు. ఉద్యమకారులందరిని పిలిచి మాట్లాడుతామన్నారు. తెలంగాణ తొలి దశతో పాటు మలి దశ ఉద్యమకా రులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఉద్యమకారులందరితోనూ మాట్లాడతామన్నారు. నష్టపోయిన అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ఏర్పాటు చేసిన కమిటీ.. అఖిలపక్ష పార్టీల నుంచి ఇద్దరి చొప్పున పిలిచామని పేర్కొన్నారు. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్థి, జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతామని వివరించారు. కవులు, కళాకారులు తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తిస్తామన్నారు. ఈ పక్రియ అమరవీరుల దీపంలో ప్రారంభమవుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని, వారిని గుర్తించాలని, అలాగే అందరి నుంచి సూచనలు స్వీకరించాలని నిర్ణయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ఉద్యమ సమయంలో తన జీవితంలో యవ్వనం పోయిందని.. మమ్మల్ని ఆదుకోవాలని ఉద్యమకారులు కోరుతున్నారని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. అందుకోసం ఉద్యమకారుల జేఏసీలు ఉన్నాయని.. వారిందరినీ కలుస్తా మన్నారు. అలాగే అన్ని యూనివర్సిటీల జేఏసీలు ఉన్నాయని.. వారితో కూడా సమావేశమవుతామని ఎమ్మెల్సీ కోదండరాం స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి జేఏసీ, యూనివర్సిటీ జేఏసీలను సంప్రదిస్తామని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడించారు. అందరి సలహాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన అని చెప్పారు. స్టేక్ హోల్డర్స్‌ను పిలిచి మాట్లాడతామన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకొని ఉద్యమకారులను గుర్తిస్తామని పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# రాహుల్ ‘ఆర్థిక సునామీ’ వ్యాఖ్యలు...

మొదటిపేజీ తరువాయి

బుధవారం కాంగ్రెస్ గిరిజన విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, దేశంలో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, తీవ్రమైన ఆర్థిక సంక్షోభం తప్పదని హెచ్చరించారు. గతంలో ఆర్థిక ఒత్తిళ్ల నుంచి దేశాన్ని కాపాడిన వ్యవస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ప్రజా వ్యతిరేకతను అణచివేసేందుకు ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించే అవకాశం ఉందని కూడా ఆయన వ్యాఖ్యానించారు.రాహుల్ ఆరోపణలపై బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ సామాజిక మాధ్యమ వేదికగా స్పందించారు. రాహుల్ వ్యాఖ్యలు తప్పు మాత్రమే కాదు, ఇది కచ్చితంగా భయాన్ని వ్యాప్తి చేయడమేనని విమర్శించారు. గత దశాబ్ద కాలంలో ఆర్థిక రక్షణ వ్యవస్థలను బలోపేతం చేశామని పేర్కొన్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగం, వాహన అమ్మకాలు, ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం, భారీ విదేశీ మారక నిల్వలు వంటివి ఆర్థిక పటిష్టతకు నిదర్శనమని పేర్కొన్నారు. సునామీ 2013లో వచ్చిందని, ఇప్పుడు కాదని వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్ ఈ దేశంలో వినాశనాన్ని సృష్టిస్తే, బీజేపీ దృఢంగా ముందుకు సాగుతోందని అన్నారు. కేంద్రమంత్రి, జేడీ(యూ) నేత లలన్ సింగ్ స్పందిస్తూ, రాహుల్ గాంధీకి ఆయన నాయనమ్మ ఇందిరా గాంధీ విధించిన 1975 ఎమర్జెన్సీని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నారని తెలిపారు. రాహుల్ పదేపదే ఇలాంటి హెచ్చరికలు చేస్తూ అస్థిరత సృష్టించాలని చూస్తున్నారని పలువురు బీజేపీ నాయకులు విమర్శించారు.

మొదటిపేజీ తరువాయి

# పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?

బీఆర్ఎస్ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరు..? అని నిలదీశారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్ఎస్‌లో చేర్చి పదవులు ఇచ్చింది ఎవరు..? అని ప్రశ్నించారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒకసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని... నిజాలు మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగాలకు కాదని, మీ గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్.. జనసేన సభ కోసం అనుమతి అడిగారని... ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదని.. సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని రాంచందర్ రావు ప్రశ్నించారు. ఈ సమావేశం పెట్టుకోవడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. దాన్ని అడ్డుకోవడమే ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. పవన్ కల్యాణ్ అంశాన్ని బీజేపీ మీద రుద్దే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారని రాంచందర్ రావు ఆగ్రహించారు. ఏపీలో బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ నిధులను పంజాబ్‌లో కేసీఆర్ పంచలేదా..? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ సపోర్ట్ చేయడంతోనే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. ఆనాడు పార్లమెంటులో తమ పార్టీ మద్దతు ప్రకటించిందని అన్నారు. సుష్మా స్వరాజ్ బేషరతుగా మద్దతు ఇస్తేనే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ ఇస్తానని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఏమైంది..? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. 12 ఏళ్ల నుంచి నీళ్ల మీద ఒక పాలసీ కూడా ఎందుకు తేలేదని నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా కంటే తక్కువ వాటాను కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను డీకే శివకుమార్‌కి.. రేవంత్‌రెడ్డి బహుమతిగా ఇచ్చారని విమర్శించారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను అప్పుల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ సూపర్ హీరో అని రాంచందర్ రావు అభివర్ణించారు. మున్ముందు బిజెపి తెలంగాణలో కీలకంగా మారుతుందన్నారు.

మొదటిపేజీ తరువాయి

# చంచల్‌గూడ జైల్లో బాల్క సుమన్‌ను కలిసిన కేటీఆర్

ఆ తర్వాత ఈ కేసును బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. గడిచిన మే 26న తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ.. సింగరేణి కాలరీస్‌కు చెందిన జూనియర్ అసిస్టెంట్ ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ అరెస్ట్ చర్యలు చేపట్టారు.

# అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన ఆత్రం సుగుణక్క

**తెలంగాణ వీణ ఆసిఫాబాద్ 04 జూన్ 2026**

ఆసిఫాబాద్: పట్టణంలోని దస్నాపూర్‌లో గత అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాద ఘటనలో నష్టపోయిన కుటుంబాలను డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క గురువారం పరామర్శించి వారి పరిస్థితిని తెలుసుకున్నారు.అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఇళ్లను పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాధితులకు సుగుణక్క తన వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు.“ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది. బాధితులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రత్యేకంగా కృషి చేస్తాం. ప్రభుత్వపరంగా అందాల్సిన సహాయ సహకారాలు త్వరగా అందేలా అధికారులతో మాట్లాడతాం” అని పేర్కొన్నారు.అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాలకు ధైర్యం చెబుతూ, కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల వెంటే ఉంటుందని సుగుణక్క అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ ఇరుకుల మంగ, డీసీసీ ఉపాధ్యక్షుడు తరిఖ్, డైరెక్టర్ మారుతి పటేల్, కౌన్సిలర్ వైరాగడే గోవింద్, మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి, కాంగ్రెస్ నాయకులు ఇల్లూరి రాము, మెంగ్రే మోహన్, హరికృష్ణ, వైరాగడే సాయి, మర్రి బాలు, జాడి ప్రసాద్, జాడి తిరుపతి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎలగలా సాయి, కమలనాథ్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీకాంత్, గేడం శ్రీధర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



మొదటిపేజీ తరువాయి

# మమతకు భారీ షాక్:

## బీజేపీ వైపు 20 మంది టీఎంసీ ఎంపీల చూపు!

తమకు 58 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని రెబల్ వర్గం ప్రకటించింది. దీంతో అసెంబ్లీలో మమతా బెనర్జీ వర్గం బలహీనపడింది. మొత్తం 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేలలో అధికశాతం మంది రెబల్ వర్గం వైపు ఉన్నారు.ఏప్రిల్-మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరపడిన తర్వాత ఈ సంక్షోభం మొదలైంది. ప్రతిపక్ష నేత ఎంపిక విషయంలో పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని రెబల్ ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ వ్యవహార శైలి, ఎన్నికల ఓటమి తర్వాత ఆయన పెత్తనం చెలాయించడమే ఈ తిరుగుబాటుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. తామంతా మమతా బెనర్జీ నాయకత్వాన్ని గౌరవిస్తామని, కానీ అభిషేక్ పెత్తనాన్ని సహించబోమని రెబల్ ఎమ్మెల్యేలు స్పష్టం చేస్తున్నారు.ఈ పరిణామాల నేపథ్యంలో, సుమారు 20 మంది టీఎంసీ ఎంపీలు బీజేపీ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇది నిజమైతే, పార్లమెంటులో మమతా బెనర్జీ బలం మరింత క్షీణిస్తుంది. ఇటీవల మమత నిర్వహించిన నిరసన కార్యక్రమానికి కేవలం ఆరుగురు ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు మాత్రమే హాజరుకావడం ఆమె చుట్టూ విధేయుల సంఖ్య తగ్గుతోందనడానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఈ తిరుగుబాటు నేపథ్యంలో టీఎంసీ బెంగాల్‌లోని అన్ని కమిటీలను రద్దు చేసి, ఆత్మపరిశీలన చేసుకుంటామని ప్రకటించింది.

మొదటిపేజీ తరువాయి

# ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలి

జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట రుణాలకు సంబంధించి కార్యచరణను ఇంకా రూపొందించ లేదని ఆరోపించారు. కనీసం ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా మూడు సంవత్సరాల కాలంలో ఆరు పంటలు పండాయని, ఇందులో ఎన్ని పంటలకు రైతు భరోసా కల్పించారో ఆయన ఆత్మకే తెలుసని విమర్శించారు. ధాన్యం సేకరణపై కాంగ్రెస్ , బీజేపీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రైతు గురించి ఆలోచించడం లేదని విమర్శించారు. పప్పు దినుసులు, నూనె గింజలు పండించాలని సలహా ఇస్తున్న ప్రభుత్వం వాటికి ఏ విధమైన ప్రోత్సాహం కల్పిస్తుందో చెప్పడం లేదని పేర్కొన్నారు. కోతుల బెడద నుంచి పంటలను కాపాడేందుకు కోతుల పునరుత్పత్తి నిలుపుదల కేంద్రాన్ని జిల్లాకు ఒకటి ఏర్పాటు చేయాలని, తక్షణమే రైతుకు సోలార్ ఫెన్సింగ్ 50 శాతం రాయితీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్లో యూరియా అందుబాటులో లేదని, యూరియా యాప్‌ను తొలగించి నేరుగా రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మొదటిపేజీ తరువాయి

# మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు

కానీ రైతులకు మాత్రం లాభం జరుగుతుందన్నారు. ఇన్నర్ సైడ్ ఎకరం కనీసం రూ.15 లక్షలు ఉందని చెప్పారు. లోయర్ సైడ్ ఏమైనా పొరపాటు జరిగితే మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పారు. హయ్యర్ సైడ్ మాత్రం మార్పులు ఉండవన్నారు. సమస్యలు ఉంటే.. హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేస్తామని పబ్లిక్‌కు ఆయన సూచించారు. త్వరలో తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని చెప్పారు. ప్యూచర్ సిటీని రద్దు చేసే అవకాశమే లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ విషయంలో.. తెలంగాణను మిగతా రాష్ట్రాలు మోడల్‌గా తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. ఏడాదిన్నరలో 90 శాతం గ్రామాల సర్వే పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూలో అవినీతి లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే అవినీతి నిరోధక శాఖ ట్రాప్‌లు అధికంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు.÷ూను వచ్చాక ఏసీబీ ట్రాప్ అయిన్న ÷ల్స్ అన్ని క్లియర్ చేశానని తెలిపారు. గత ప్రభుత్వంలో మూడేళ్లు రెవెన్యూ ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. కానీ తాను వచ్చిన మూడు నెలల్లోనే 3,500 రెవెన్యూ ఫైల్స్ క్లియర్ చేశానని వివరించారు. అసెంబ్లీలో పెండింగ్‌లో ఉన్న 10 ఏళ్ల ఫైల్స్ ఆరు నెలల్లోనే క్లియర్ చేసినట్లు చెప్పారు. తనకు ఏ శాఖ కేటాయించినా.. కళ్లు మూసుకొని పని చేస్తానని పేర్కొన్నారు.÷-రజలకు, ప్రభుత్వానికి మంచి జరిగే ఏ పని చేయడానికైనా తాను భయపడనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లకు రూ. 7 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. రాష్ట్రంలో పాడి ప్రోక్యూర్‌మెంట్ 90 శాతం పూర్తయిందన్నారు. అసైన్డ్ భూములకు పాలసీ తీసుక వస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగినవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితా లో చేర్చిందని మంత్రి పొంగులేటి వివరించారు.

## బడిబాటతో ప్రభుత్వ బడులకు

# కొత్త ఊపు

### నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వ

### పాఠశాలల వైపు తల్లిదండ్రుల అడుగులు

**జహీరాబాద్, జూన్ 4 ( తెలంగాణ వీణ):**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝురాసంగం మండలం కుప్పానగర్ గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామంలోని తల్లిదండ్రులు, కూలీలతో సమావేశమై ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా సదుపాయాలపై అవగాహన కల్పించారు.ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, మధ్యాహ్న భోజన పథకం, డిజిటల్ విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సేవలు ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలని వివరించారు. ప్రతి చిన్నారి విద్యకు దూరం కాకుండా ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు.రానున్న 2026-27 విద్యా సంవత్సరంలో అధిక సంఖ్యలో అడ్మిషన్లు నమోదు చేయాలనే లక్ష్యంతో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "ప్రతి బిడ్డ బడికి.. ప్రతి తల్లిదండ్రి ప్రభుత్వ బడికి అండగా నిలవాలి" అని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.అనిత, అమర్‌నాథ్, ఉపాధ్యాయులు పి.రమేష్, ఇమ్మాన్యుయేల్, పి.కరుణజ్యోతి, షఫీ, సీఆర్‌పీ సంతోష్, ఐఈఆర్‌పీ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు జన్మదిన వేడుకలు


**తెలంగాణవీణ - కూకట్ పల్లి ..**

శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు జన్మదినం సందర్భంగా,కూకట్ పల్లి,బాలకృష్ణ నగర్ లోని వృద్ధి బ్యాంక్వెట్ హాల్ లో మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, గొట్టుముక్కల వెంగళరావు,మందాడి శ్రీనివాసరావు, తూము శ్రవణ్ కుమార్, ఆవుల రవీందర్ రెడ్డి, నవత రెడ్డి, సాయిబాబా, ముద్దాపురం నరసింహ యాదవ్, కూకట్ పల్లి నియోజకవర్గం కోఆర్డినేటర్ సతీష్ అరోరా , గౌసుద్దీన్ స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేసిన మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ రంగా రావు మాట్లాడుతూ.నా జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ కార్పొరేటర్లకు బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు, మహిళ నాయకురాళ్లకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టుముకుల పెద్ద భాస్కర్ రావు,భద్రయ్య, ఆంజనేయులు,లక్ష్మీనారాయణ ,సంతోష్ ,ప్రభాకర్,తులసీరావు,ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ దరఖాస్తుల ఆహ్వానం

**తెలంగాణవీణ - కూకట్ పల్లి ..**



ప్రీ ప్రైమరీ లో ఇన్స్ట్రక్టర్ ,పాఠశాలలో ఆయాల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ కోరుతూ పత్రికా ప్రకటన విడుదల చేసిన కూకట్ పల్లి మండల విద్యాధికారి రవీందర్ రాజు.కూకట్ పల్లి మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ సెక్షన్లు, మంజూరు అయినటువంటి ప్రాథమిక పాఠశాలలో ఇన్స్ట్రక్టర్ అలాగే ఆయాల పోస్టుల భర్తీ కొరకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరించడానికి ఆహ్వానిస్తున్నాము అని ప్రకటించారు.ప్రీ ప్రైమరీ పోస్టుకు గాను ఇంటర్ విద్యార్హత కలిగి శిశువిద్యా లేదా ప్రైమరీ టీచింగ్ లో అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. ఆయాలకు విద్యార్హత ఏడవ తరగతి. అభ్యర్థుల వయస్సు 18 సంవత్సరాల నుండి 44 సంవత్సరాల లోపు ఉండాలి. ఇందుకు ఎస్సీ,ఎస్టీ,బీసీ,ఈ డబ్ల్యు ఎస్, ఎక్స్ సర్వీస్మెన్ లకు వయసులో ఆయా క్యాటగిరీల వారీగా వయసులో సడలింపు ఉంటుందని తెలిపారు.దరఖాస్తు దారులు స్థానిక నివాసులై ఉండాలి. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు ఫారములు పూరించి సంబంధిత సర్టిఫికెట్లను జతపరిచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూకట్పల్లి ప్రాంగణంలో గల మండల విద్యాశాఖ అధికారి కూకట్ పల్లి లో ఈ నెల 8 వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు అందజేయాలి.

# భవిష్యత్తు తరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకుందాం

## జిల్లా కలెక్టర్ దివాకర.టిఎస్






**తెలంగాణ వీణ// ఖమ్మం బ్యూరో**

ఖమ్మం:---గ్రామాలలో చెత్త నిర్వహణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలివరదల సమయంలో ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి ప్రత్యామ్నాయ పంటల సాగు, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలిఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై అపోహలను వీడి ప్రజలు సహకరించాలిఅర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్.ఐ.ఆర్. లక్ష్యం

ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామ సభలో పాల్గొన్న జిల్లా కలెక్టర్భవిష్యత్తు తరాల కోసం మనమందరం పర్యావరణాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.

ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామంలోనీ రైతు వేదికలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సభలు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే ముఖ్య వేదికలని అన్నారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై సమగ్ర వివరాలు తెలియజేసి, ప్రజలు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు.ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కాలువల అభివృద్ధి, సాగునీటి పనుల పురోగతిపై గ్రామస్తులతో చర్చించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.పంటల మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తూ, వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్‌పామ్, కూరగాయలు, పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.వర్షాభావ పరిస్థితులు తక్కువగా ఉన్న నేపథ్యంలో బోర్‌వెల్ సౌకర్యం కలిగిన రైతులు షార్ట్ డ్యూరేషన్ వరి సాగు చేపట్టవచ్చని తెలిపారు. పంటలకు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.గ్రామాలలో చెత్తను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా నేపథ్యంలో పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని, ప్రస్తుతం స్వచ్ఛమైన తాగునీటి కోసం డబ్బులు చెల్లిస్తున్నామని, భవిష్యత్తులో స్వచ్ఛమైన గాలి కోసం కూడా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని సూచించారు.భవిష్యత్ తరాలు మెరుగైన జీవనం సాగించాలంటే పర్యావరణ పరిరక్షణ అత్యంత ముఖ్యమని అన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఒకేరోజు కుంభవృష్టి తరహా వర్షాలు కురిసి వరదలు సంభవిస్తున్నాయని, అడవుల నరికివేత కారణంగా కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయని తెలిపారు. కోతుల సమస్యకు తక్షణ పరిష్కారం లేదని, గ్రామస్థులు తమ జీవన విధానంలో మార్పులు చేసుకుంటేనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.జిల్లాకు సమగ్ర విపత్తు నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేయాల్సిన అవసరాన్ని వివరించిన కలెక్టర్, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మురుగు కాల్వల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నీటి సంరక్షణ చర్యలు, కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.వరదల సమయంలో ప్రజలు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించి లోతట్టు ప్రాంతాల నుంచి వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా ఇండ్లు కూలి పోవడం, విద్యుత్ స్తంభాలు, పెద్ద చెట్లు కూలిపోవడం వంటి ఘటనలతో ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందన్నారు. రహదారులు, కల్వర్టులపై వరద నీరు ప్రవహిస్తున్న సమయంలో అధికారుల హెచ్చరికలను పట్టించుకోకుండా ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగు తున్నాయని తెలిపారు. ప్రమాదకర పరిస్థితుల్లో సెల్ఫీలు తీసుకోవడం కూడా ప్రాణాపాయానికి దారితీస్తుందని హెచ్చరించారు.పాతబడిన ఇళ్లలో నివసించే వారు భారీ వర్షాల సమయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు లేదా ఇతర సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. వరదల సమయంలో అనవసరంగా బయటకు వెళ్లవద్దని, విపత్కర పరిస్థితుల్లో హీరో అవ్వాలని ప్రయత్నించవద్దని హితవు పలికారు.ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం ద్వారా ఓట్లు తొలగిపోతాయనే ప్రచారం పూర్తిగా అపోహ మాత్రమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం అనంతరం పలుమార్లు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించారని, ఓటరు జాబితా శుద్ధీకరణే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, డూప్లికేట్ ఓట్లు మాత్రమే తొలగిస్తామని చెప్పారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోరని భరోసా కల్పించారు.జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి మిగిలిన ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని తెలిపారు. ప్రజలు తమ వివరాలను నమోదు చేసి ప్రభుత్వం గుర్తించిన 11 గుర్తింపు పత్రాల్లో ఏదో ఒక దానిని జతచేసి సమర్పించాలని సూచించారు.జూలై 31, 2026న డ్రాఫ్ట్ ఎస్.ఐ.ఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి ఓటరు తన పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని, అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్‌లు ఉంటే ఆగస్టు 30లోగా సమర్పించాలని సూచించారు.జూలై 1, 1987కు ముందు భారతదేశంలో జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన ఆధార పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, జూలై 1, 1987 నుంచి డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తండ్రి లేదా తల్లి ఎవరి అయినా ఒకరి పత్రం సమర్పించాలని తెలిపారు.డిసెంబర్ 2, 2004 తర్వాత జన్మించిన వారు తండ్రి, తల్లి ఇద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.సెప్టెంబర్ 28, 2026 నాటికి అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరించి, అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా ను విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బి జ్యోతి, ఆత్మ పిడి బి.సరిత, ఏవో ఉమా నగేష్, పశువైద్యులు జగ్గలాల్ సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజ్‌గిరి నూతన సీపీ సుమతి గారిని కలిసిన ఎమ్మెల్యే శ్రీగణేష్

**తెలంగాణ వీణ , మల్కాజ్‌గిరి,**

మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌గా ఇటీవల నియమితులైన శ్రీమతి సుమతి గారిని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గురువారం కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ, డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, సరఫరాపై చేపడుతున్న నివారణ చర్యల గురించి ఎమ్మెల్యే సీపీతో చర్చించారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలని, నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు.ప్రజల భద్రత, శాంతియుత వాతావరణ పరిరక్షణ కోసం పోలీస్ శాఖకు తమ సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు.






తెలంగాణవీణ
మీ గళానికి మా కలం
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్నీ జిల్లాల నుండి విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9395599999

# ఫతేనగర్ డివిజన్ లో పేరుకుపోయిన చెత్త

## అధికారులు మాజీ కార్పొరేటర్ ఆకస్మిక తనిఖీ - రాంకీపై చర్యలకు డీసీ హామీ

తెలంగాణవీణ - కూకట్ పల్లి..

గురువారం ఉదయం బోయిన్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఫతే నగర్ డివిజన్‌లో, పేరుకుపోయిన చెత్త పాయింట్లను డీసీ డాక్య నాయక్ , స్థానిక మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ సంయుక్తంగా పర్యటించారు.డివిజన్‌లోని ఫతేనగర్ ఫ్లైఓవర్ కింద, ఇందిరా గాంధీపురం ,ఎల్బీఎస్ నగర్, గౌతమ్ నగర్, పిట్టల బస్తి, శోభన కాలనీ ప్రాంతాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతో, ఎక్కడికక్కడ చెత్త కుప్పలుగా పేరుకుపోయిన విషయాన్ని సతీష్ గౌడ్ జోనల్ కమిషనర్ దృష్టికి, డిసి డాక్యునాయక్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది,చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను గురువారం ఉదయం అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. సమస్య తీవ్రతను గుర్తించిన డీసీ డాక్య నాయక్ తక్షణమే స్పందించారు.ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యానికి విఘాతం కలిగించేలా చెత్త పేరుకుపోవడం సరికాదు. రాంకీ సంస్థ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది అని. వెంటనే రాంకీ వారిపై చర్యలు తీసుకుని, చెత్తను యుద్ధప్రాతిపదికన తొలగించేలా ఆదేశాలు జారీ చేస్తాం అని హామీ ఇచ్చారు.అనంతరం కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ మాట్లాడుతూ. వార్డులో ఎవరికైనా ఏ చిన్న అవసరం వచ్చినా, ఏ సమస్య ఎదురైనా నిస్సంకోచంగా తనను సంప్రదించగలరనీ. త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పింఛన్లు, రేషన్ కార్డులు లాంటి ఏ సమస్య అయినా సరే, నేను సంబంధిత ప్రభుత్వ అధికారులతో నేరుగా సమన్వయం చేసుకుని, మీ సమస్యను త్వరితగతిన పరిష్కరించడానికి దగ్గరుండి పనిచేస్తానని హామీ ఇస్తున్నాను అని తెలిపారు.ప్రజల నమ్మకమే తన బలం. ప్రజాసేవే తన మొదటి కర్తవ్యం అని. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను అని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.







# ఘనంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ NFIW వ్యవస్థాపక దినోత్సవం

## మహిళల పక్షాన చారిత్రిక పోరాటాలు

### జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

### బత్తినేని నీరజఏపూరి లతాదేవి

తెలంగాణ వీణ //ఖమ్మం బ్యూరో

ఖమ్మం : మహిళల పక్షాన భారతదేశంలో చారిత్రిక పోరాటాలను నిర్వర్తించిన ఘనత భారత మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ)కు దక్కుతుందని భారత మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి తెలిపారు. దశాబ్దాల పోరాట చరిత్రలో అనేక పోరాట విజయాలను మహిళా సమాఖ్య సాధించిందని ఆమె తెలిపారు. మహిళా సమాఖ్య 72వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో మహిళా సమాఖ్య పతాకాన్ని ఏపూరి లతాదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా –అధ్యక్షురాలు బత్తినేని నీరజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపూరి లతాదేవి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు –గడిచిన మహిళలు ఇంకా వివక్షను ఎదుర్కొంటునే ఉన్నారన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ముందు వరుసలో ఉండి పని చేస్తున్నా వివక్ష పోవడం లేదన్నారు. చట్టాలు అక్రమార్కులకు, కామాంధులకు చుట్టాలుగా మారుతున్నాయని లతాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. భారత మహిళా సమాఖ్య అనేక చారిత్రిక పోరాటాలను నిర్వహించిందని ప్రస్తుతం మహిళలు అనుభవిస్తున్న చట్టాల వెనుక మహిళా –సమాఖ్య పోరాటాలు దాగి ఉన్నాయన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడుతున్నామని కానీ డిలిమిటేషన్ తో ముడిపెట్టి మహిళా –రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటున్నారని లతాదేవి ఆరోపించారు. మహిళల చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, వివిధ కేసులకు –సంబంధించి ఫాస్ట్రాక్ కోర్టుల ద్వారా తక్షణ న్యాయం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని లతాదేవి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు పోటు కళావతి, జిల్లా బాధ్యులు జమ్ముల లక్ష్మి, మందడపు రాణి, దండి రాజేశ్వరి, ఓరుగంటి ప్రమీల, భవాని, సృజన, కృష్ణవేణి, సౌజన్య, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



# వందేళ్ల అపూర్వ పోరాట గాథ సిపిఐది

## రాయన్నపేటలో ముమ్మరంగా సిపిఐ సభ్యత్వం నమోదు కార్యక్రమం

### సిపిఐ జిల్లా కార్యదర్శి దండిసురేష్

తెలంగాణ వీణ //ఖమ్మం బ్యూరో

ఖమ్మం:–బోనకల్: భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 100 ఏళ్ల ప్రయాణం ఒక అపూర్వ పోరాట గాథ అని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. మండలం లోని రాయన్నపేట లో సిపిఐ సభ్యత్వ కార్యక్రమం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ముమ్మరశీ గా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ 1925లో ప్రజా సమస్యలను అజెండాగా పెట్టుకుని ఏర్పడిన సీపీఐ,కూలీలు,రైతులు,విద్యార్థులు,మహిళలు,అట్టడుగు వర్గాల హక్కుల కోసం దేశవ్యాప్తంగా భూస్వామ్య అణచివేతకు వ్యతిరేకంగా, కార్మికుల కనీస వేతనాల కోసం, రైతుల రుణమాఫీల కోసం, మహిళల స్వేచ్ఛ––భద్రత కోసం, యువతకు ఉపాధి అవకాశాల కోసం సిపిఐ నడిపిన పోరాటాలు భారత రాజ్యాంగ విలువలను బలపరిచాయన్నారు. సమానత్వం, సెక్యులరిజం, ప్రజాస్వామ్య రక్షణ, ఈ విలువలను కాపాడేందుకు పార్టీ ఎన్నో దశాబ్దాలుగా రాజ్యాంగవ్యాప్త దాడులను ప్రతిఘటిస్తూ ముందడుగు వేసిందన్నారు. దేశ రాజకీయాలు ప్రమాదకర మలుపులోకి వెళ్తున్నాయనీ, కార్పొరేట్ శక్తులు ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తున్నాయన్నారు. భారత రాజ్యాంగ విలువలు –– సెక్యులరిజం, సామాజిక న్యాయం, సమానత్వం ,సవాళ్లకు లోనవుతున్నాయనీ అన్నారు. సిపిఐ ప్రజాస్వామ్యం రక్షణలో కీలక భూమిక పోషిస్తుందన్నారు. ప్రతి వార్డు, బస్తీ, ప్రతి కుటుంబంలో పార్టీని మరింత బలపరచడం మనందరి బాధ్యత అని, అన్యాయాలు, అవినీతి, హింస, సామాజిక ద్వేషం,ఇవన్నిటికి వ్యతిరేకంగా ప్రజాపక్ష పోరాటాలు మరింత బలపడాలన్నారు. దళితుల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం అభ్యున్నతి అమరజీవి తూము ప్రకాషరావు తన సర్వస్వాన్ని త్యాగం



చేశారన్నారు. ఆయన ఆశయాలు కొనసాగిస్తూ నేటి యువత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ సీనియర్ నాయకులు వల్లబోయిన జానయ్య, శాఖ కార్యదర్శి ఏలూరి పూర్ణచంద్రరావు, నాయకులు బొమ్మనేని కొండలరావు, మహిళా నాయకురాలు మరిదు ఈశ్వరమ్మ, సొసైటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# యాప్రాల్‌లో ఉచిత పింఛన్ల సర్టిఫికేట్ నవీకరణ, వెరిఫికేషన్ క్యాంప్

తెలంగాణవీణ, యాప్రాల్ :

యాప్రాల్ పరిధిలోని ప్రజలకు లబ్ధి చేకూర్చేలా ఉచిత పింఛన్ల లైఫ్‌టైమ్ సర్టిఫికేట్ నవీకరణ మరియు వెరిఫికేషన్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ సత్యనారాయణ బాబు ఒక ప్రకటనలో తెలిపారు.స్థానిక మల్లన్న టెంపుల్ ప్రాంగణంలో ఈ ప్రత్యేక క్యాంప్‌ను ఏర్పాటు చేయనున్నారు. వృద్ధాప్య పింఛన్, వితంతు పింఛన్ మరియు వికలాంగుల పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పింఛన్ నవీకరణ ప్రక్రియ కోసం వచ్చే లబ్ధిదారులు తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డు (ఆధార్ కార్డ్) నకలును వెంట తీసుకురావాలని సూచించారు. యాప్రాల్ డివిజన్ పరిధిలోని అర్హులైన ప్రజలందరూ ఈ శిబిరానికి విచ్చేసి తమ పింఛన్ పత్రాలను ఉచితంగా వెరిఫికేషన్ చేయించుకోవాల్సిందిగా డాక్టర్ సత్యనారాయణ బాబు విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోండి

## ఉద్యమకారుల కమిటీకి సిపిఐ సూచనలు- రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్

### రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈటె నరసింహ




తెలంగాణ వీణ //ఖమ్మం బ్యూరో

గురువారం రాష్ట్ర సెక్రటేరియట్ లో తెలంగాణ ఉద్యమకారుల కమిటీ ఆధ్వర్యంలో, జరిగిన అఖిలపక్ష సమావేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తరఫును రాష్ట్ర సహాయ కార్యదర్శులు, తక్కలపల్లి శ్రీనివాసరావు, ఈ టి నరసింహ,పాల్గొన్నారు తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన సీపీఐ, ఉద్యమకారుల ఆకాంక్షలు మరియు వారి కుటుంబాల రక్షణ కోసం ఈ క్రింది ప్రధాన ప్రతిపాదనలను కమిటీ దృష్టికి తీసుకెళ్లింది.తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాలకు ఇళ్లు, ప్రభుత్వ ఉద్యోగం, మరియు ఆర్థిక సాయం అందేలా చూడాలి. ఇప్పటివరకు సాయం అందని మిగిలిన కుటుంబాలను వెంటనే ఆదుకోవాలి.ఉద్యమ సమయంలో విద్యార్థులు, యువకులు, మరియు ఉద్యమకారులపై నమోదైన అన్ని రకాల పోలీస్ కేసులను ఎలాంటి షరతులు లేకుండా పూర్తిగా ఎత్తివేయాలి.వయసు పైబడిన, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఉద్యమకారులకు నెలవారీ గౌరవ వేతనం అందించాలి. అలాగే వారి కుటుంబ సభ్యులందరికీ ఉచిత కార్పొరేట్ వైద్య సదుపాయం ఆరోగ్య కార్డులు, కల్పించాలి.కమ్యూనిస్టులు మరియు ఇతర సామాజిక శక్తులు చేసిన సాయుధ పోరాటాలు, మలిదశ ఉద్యమ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి. గన్‌పార్క్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో అమరవీరుల జ్ఞాపకార్థం స్మారక చిహ్నాలను నిర్మించాలి.తెలంగాణ సిద్ధించి ఒకటిన్నర దశాబ్దం కావస్తున్నా.. నీళు ,, నిధులు, నియామకాలతో పాటు సామాజిక సమానత్వం అనే ఉద్యమ ఆకాంక్షలు ఇంకా పూర్తిగా నెరవేరలేదు. ఉద్యమకారులను గౌరవించుకోవడం అంటే ఆ ఆకాంక్షల సాధన కోసం పనిచేయడమే."ఉద్యమకారుల కమిటీ కేవలం నామమాత్రంగా కాకుండా, క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల నుంచి వినతులు స్వీకరించి ప్రభుత్వానికి త్వరితగతిన నివేదిక సమర్పించాలని సీపీఐ డిమాండ్ చేస్తోంది.

తెలంగాణవీణ
8328209811

# మల్కాజ్‌గిరిలో బీఆర్ఎస్ BLA ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం

## పార్టీ బలోపేతానికి కట్టుదిట్టంగా పనిచేయాలి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**తెలంగాణ వీణ , మల్కాజ్‌గిరి,**

మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ దీూా ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమాన్ని గౌరవ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో విజయవంతంగా నడిపించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని గుర్తుచేశారు. బంగారు తెలంగాణ లక్ష్య సాధనలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే కేసీఆర్ తిరిగి నాయకత్వం వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేసీఆర్ స్ఫూర్తితో పార్టీ శ్రేణులు మరింత కట్టుదిట్టంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను చేపట్టిన పలు కార్యక్రమాలు, సాధించిన నిధులు, అమలవుతున్న అభివృద్ధి పనుల గురించి సమావేశంలో వివరించారు. అలాగే ఓటరు జాబితాలో ూ×= అనుసంధాన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతి కార్యకర్త ఓటరు నమోదు, ధృవీకరణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎంబీసీ చైర్మన్, మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నమోదు ఇన్‌చార్జి నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, మేకల సునీత, రాము యాదవ్, మురుగేష్‌తో పాటు జేఏసీ వెంకన్న, తోట నరేందర్ రెడ్డి, జీకే హనుమంతరావు, అమీరుద్దీన్, అనిల్ కిషోర్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, కృష్ణ గౌడ్, లక్ష్మణ్ యాదవ్, ఢిల్లీ పరమేష్, డోలి రమేష్, భాస్కర్ రెడ్డి, అరుణ్ రావు, అరవింద్, శరణ్ గిరి, హేమంత్ పటేల్, వంశీ ముదిరాజ్, ఉస్మాన్, కేబుల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు.

### వర్షాకాలానికి ముందే కౌకూర్‌లో

# సమస్యలు పరిష్కరించాలి

## : తుడిమెల్ల మల్లికార్జున్- అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో ముమ్మర పరిశీలన

**తెలంగాణవీణ, యాప్రాల్ :**



మైనంపల్లి హనుమంతరావు నాయకత్వంలో, మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెల్ల మల్లికార్జున్ ఆధ్వర్యంలో యాప్రాల్ డివిజన్ పరిధిలోని కౌకూర్ ప్రాంతంలో గురువారం విస్తృత స్థాయి పరిశీలన నిర్వహించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న పలు మౌలిక వసతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా మహదేవ్‌పూర్ ప్రాంతంలోని అండర్‌గ్రౌండ్ మురుగునీటి పైప్‌లైన్ మళ్లింపు పనులు, ఇందిరా కాలనీ ఎస్సీ బస్తీలో మురుగునీటి ఓవర్‌ఫ్లో సమస్యలు, తాగునీటి సరఫరా ఇబ్బందులను పరిశీలించారు. అలాగే హరిజన్ బస్తీలో మురుగునీటి పైప్‌లైన్లలో పేరుకుపోయిన సిల్ట్ (మట్టి), తక్కువ నీటి ఒత్తిడి (లో-ప్రెషర్), బోర్‌వెల్ మరమ్మతులు, స్టార్మ్ వాటర్ డ్రైన్ల నిర్వహణ, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్ పరిస్థితితో పాటు ఇతర పెండింగ్ సమస్యలను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**అధికారుల తక్షణ స్పందన**

ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ యాప్రాల్ సెక్షన్ మేనేజర్ మల్లికార్జున్ సానుకూలంగా స్పందించారు. సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత సిబ్బందికి తక్షణ చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా తుడిమెల్ల మల్లికార్జున్ మాట్లాడుతూ... వర్షాకాలం ప్రారంభం కాకముందే అన్ని ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను, సిబ్బందిని కోరారు. ముఖ్యంగా మురుగునీటి కాలువల శు భ్రపరిచే పనులు, పైప్‌లైన్‌లలోని అడ్డంకుల తొలగింపు, పనిచేయని బోర్‌వెల్‌ల మరమ్మతులు, స్టార్మ్ వాటర్ డ్రైన్లు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్ సక్రమ నిర్వహణ ద్వారా వర్షాకాలంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కౌకూర్ ప్రాంతంలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని అధికారులు ఈ సందర్భంగా స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివరాజ్, రాజ్‌కుమార్, స్థానిక నివాసితులు విజయ్ కుమార్, అంజిరెడ్డి, రమేష్, మహేష్, సందీప్, రాజ్‌కుమార్ పాల్గొని స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అధికారుల తరపున హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ యాప్రాల్ సెక్షన్ మేనేజర్ మల్లికార్జున్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, లైన్‌మెన్ కుమార్, లక్ష్మణ్, జగదీష్, సీవరేజ్ సిబ్బంది శివానంద్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ పనులు బంద్

## - మేస్త్రీల సంఘం ఏకగ్రీవ తీర్మానం

## సమస్యల పరిష్కారానికి, సంక్షేమం కోసం మేస్త్రీలు ఏకం కావాలని పిలుపు...

## నిబంధనలు ఉల్లంఘిస్తే రూ. 25 వేల జరిమానా హెచ్చరిక



**తెలంగాణవీణ, కాప్రా :**

మేస్త్రీల సంక్షేమం, ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాప్రా, కీసర, ఘట్‌కేసర్ మండలాల పరిధిలో ఇంటి నిర్మాణ పనులను పూర్తిగా బంద్ చేస్తున్నట్లు మేస్త్రీల సంఘం ప్రకటించింది. సెంట్రింగ్ కాంట్రాక్టర్ల ఏకపక్ష ధరల పెంపుదల, ఇతర కఠిన చర్యలను నిరసిస్తూ... గురువారం పద్మశాలి టౌన్‌షిప్‌లో మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో వరుసగా మూడోరోజు కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మూడు మండలాల నుంచి పెద్ద ఎత్తున మేస్త్రీలు తరలివచ్చి తమ ఆవేదనను, సమస్యలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రాష్ట్రస్థాయి మేస్త్రీల సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా కుదేలైందని ఆందోళన వ్యక్తం చేశారు. భవన నిర్మాణాలు చేపడుతున్న మేస్త్రీలు, బిల్డర్లు భారీగా నష్టపోతున్నారని తెలిపారు. ఇప్పటికే కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టి నిర్మించిన ఇండ్లు అమ్ముడుపోక, మార్కెట్ మందగించి అందరూ అప్పుల ఊబిలో చిక్కుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్ట తరుణంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు అడ్డగోలుగా ధరలు పెంచడం, పనుల నిర్వహణలో మొండికేయడం దారుణమన్నారు.

**నిర్ణయాన్ని కాదని పనులు చేస్తే జరిమానా:**

సెంట్రింగ్ కాంట్రాక్టర్ల చర్యలకు వ్యతిరేకంగా తాము సైతం భవన నిర్మాణ పనులను నిలిపివేయాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు నాయకులు స్పష్టం చేశారు. సంఘం తీసుకున్న ఈ బంద్ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎవరైనా దొంగచాటుగా పనులు చేపడితే.. సదరు వ్యక్తులకు రూ. 25,000 జరిమానా విధిస్తామని కఠినంగా హెచ్చరించారు. మేస్త్రీల అంతర్గత ఐక్యతతోనే ఈ సమస్యను పరిష్కరించుకోగలమని పిలుపునిచ్చారు. త్వరలోనే మూడు మండలాల పరిధిలో సమగ్రమైన మేస్త్రీ సంఘం కమిటీని ఏర్పాటు చేసి, భవిష్యత్తు కార్యాచరణను అధికారికంగా ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ మహాసభలో కాప్రా, కీసర, ఘట్‌కేసర్ పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 500 మందికి పైగా మేస్త్రీలు, నిర్మాణ రంగ కార్మికులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ

# భాగస్వాములు కావాలి

## - అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**తెలంగాణవీణ, మేడ్చల్ జిల్లాప్రతినిధి :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కలెక్టరేట్‌లో పర్యావరణ అవగాహన వాల్ పోస్టర్లను జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆవిష్కరించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మేడ్చల్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ పోస్టర్లను రూపొందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంపొందించడం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. పర్యావరణ సందేశాలు ప్రతి ఒక్కరికీ చేరాలనే ఉద్దేశంతో, ఈ వాల్ పోస్టర్లను కలెక్టరేట్‌తో పాటు జిల్లా పరిధిలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు మరియు స్థానిక సంస్థల కార్యాలయాల నోటీస్ బోర్డులపై ప్రముఖంగా ప్రదర్శించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వచ్ఛమైన, హరితమైన మరియు స్థిరమైన పర్యావరణ నిర్మాణంలో ప్రతి పౌరుడు బాధ్యతగా భాగస్వామి కావాలని ఆయన ఆకాంక్షించారు. పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలను వాడటంపై అవగాహన.

ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు-2026 ప్రకారం ఇళ్లలోనే తడి, పొడి మరియు హానికరమైన వ్యర్థాలను వేరు చేయడం, నాలుగు రకాల వ్యర్థాలను వేరు వేరుగా వేయడం కోసం నిర్దేశించిన రంగుల వారీ డస్ట్‌బిన్ల వినియోగం గురించి ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మేడ్చల్ ప్రాంతీయ కార్యాలయ పర్యావరణ ఇంజనీర్ బి. రాజేందర్, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ జి. లింగయ్య కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.




# సరికొత్త 'ఎఫ్ఎస్ఎస్' యాప్ ద్వారానే ఎరువుల విక్రయాలు

## - జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ

## అలియాబాద్ రైతువేదికలో

## ఎరువుల డీలర్లకు, అధికారులకు శిక్షణ...

**తెలంగాణవీణ, మేడ్చల్ జిల్లా ప్రతినిధి**

:కేంద్ర ప్రభుత్వం ఎరువుల అమ్మకాల కోసం కొత్తగా తీసుకువచ్చిన 'ఎఫ్ఎస్ఎస్' యాప్ ద్వారానే రైతులందరూ అన్ని రకాల ఎరువులను కొనుగోలు చేయాలని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ సూచించారు. గురువారం శామీర్పేట్ మండలం అలియాబాద్ గ్రామ పరిధిలోని రైతువేదికలో మండల పరిధిలోని ఎరువుల డీలర్లకు, రైతులకు ,వ్యవసాయ విస్తరణ అధికారులకు ఈ కొత్త యాప్ పనితీరు, వినియోగంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ మాట్లాడుతూ... తెలంగాణ వ్యాప్తంగా ఈ సరికొత్త 'ఎఫ్ఎస్ఎస్' యాప్‌ను ప్రాథమికంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. పారదర్శకమైన రీతిలో ఎరువుల పంపిణీ, నిల్వల పర్యవేక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. డీలర్లు, రైతులు , క్షేత్రస్థాయి అధికారులు ఈ యాప్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, రాబోయే రోజుల్లో దీని ద్వారానే లావాదేవీలు జరుగుతాయని ఆమె స్పష్టం చేశారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా యాప్ లో ఎరువుల స్టాక్ నమోదు చేయడం, రైతుల వివరాల నమోదు, విక్రయాల ప్రక్రియను డిజిటల్‌గా ఎలా పూర్తి చేయాలనే అంశాలపై డీలర్లకు, అధికారులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని ఉన్నతాధికారులు సూచించారు. శిక్షణా కార్యక్రమంలో శామీర్పేట్ మండల వ్యవసాయ అధికారిరమేశ్, దుండిగల్ వ్యవసాయ అధికారి యాదగిరి, బాలానగర్ వ్యవసాయ అధికారి సాయి రమేష్, ఉప్పల్ వ్యవసాయ అధికారి కృపాకర్ రెడ్డితో పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు సుధీర్ కుమార్, శ్రీనాథ్, మండల పరిధిలోని పలువురు ఎరువుల డీలర్లు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



# యాప్రాల్‌లో మల్కాజిగిరి జోనల్ కమిషనర్ పరిశీలన...

## కొత్త సీసీ రోడ్ల ప్రతిపాదనలు,

## నీటి నిల్వ సమస్యలపై సమీక్ష

**తెలంగాణవీణ, కీసర :**

మల్కాజిగిరి జోనల్ కమిషనర్ గురువారం కీసర సర్కిల్ పరిధిలోని యాప్రాల్ సాయి కృపా కాలనీలో విస్తృతంగా పర్యటించారు. కాలనీలో నెలకొన్న పలు సమస్యలపై పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా కాలనీలో కొత్తగా నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్ల ప్రతిపాదనలను పరిశీలించడంతో పాటు, వర్షాకాలం నేపథ్యంలో ఎదురవుతున్న నీటి నిల్వ సమస్యలు, టౌన్ ప్లానింగ్ అంశాలపై స్థానికులతో, అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతిపాదిత సీసీ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కార మార్గాలు అన్వేషించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో టౌన్ ప్లానింగ్ నియమ నిబంధనలను పక్కాగా అమలు చేయాలన్నారు. పనుల సమర్థవంతమైన అమలు, నిర్దేశిత గడువులోగా సకాలంలో పూర్తి చేయడం కోసం సంబంధిత ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పరిశీలన కార్యక్రమంలో డీసీ రామలింగం, డీఈఈ మాధవాచారి, ఏఈ సత్యలక్ష్మి మరియు ఇతర మున్సిపల్ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.



# కమ్యూనిస్టులపై పవన్ కళ్యాణ్ విషం చిమ్మడం మానుకోవాలి

- ఏఐవైఎఫ్ డిమాండ్

చరిత్ర తెలియకుండా మాట్లాడితే యువత తిప్పికొడుతుంది...

బహిరంగ క్షమాపణ చెప్పాలని కల్లూరు ధర్మేంద్ర హెచ్చరిక

**తెలంగాణవీణ, హైదరాబాద్ :**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కమ్యూనిస్ట్ పార్టీలపై చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయ అజ్ఞానానికి, అవకాశవాదానికి పరాకాష్ట అని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండించింది. పవన్ కళ్యాణ్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, దేశవ్యాప్తంగా ఉన్న వామపక్ష కార్యకర్తలకు, కార్మికులకు, రైతులకు, యువతకు భేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో రైతులకు భూమి, కార్మికులకు హక్కులు, యువతకు ఉద్యోగాలు, విద్యార్థులకు విద్య, పేదలకు సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన కమ్యూనిస్టు ఉద్యమాలను విమర్శించే నైతిక హక్కు పవన్ కళ్యాణ్‌కు లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రజల కోసం జైళ్లకు వెళ్లి, ప్రాణత్యాగాలు చేసిన వేలాది మంది కమ్యూనిస్టుల చరిత్రను ఒక్క రాజకీయ ప్రసంగంతో చెరిపివేయలేరని అన్నారు. పవన్ కళ్యాణ్ రాజకీయ అవకాశవాద విధానాలపై కల్లూరు ధర్మేంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. “2019 ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీలతో కలిసి తిరిగింది పవన్ కళ్యాణ్ కాదా? అప్పుడు కమ్యూనిస్టులు దేశభక్తులుగా కనిపించి, ఇప్పుడు శత్రువులయ్యారా? ఎన్నికల అవసరాలకు అనుగుణంగా సిద్ధాంతాలు మార్చుకోవడం రాజకీయ అవకాశవాదం కాక మరేమిటి?” అని ప్రశ్నించారు.

**సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే..**

నేడు దేశ యువత నిరుద్యోగంతో అల్లాడుతోందని, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ బాట పట్టాయని, ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయడం లేదని ధర్మేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్య ఖరీదై పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా మారిందన్నారు. ఈ ప్రధాన సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించాల్సిన పవన్ కళ్యాణ్, ప్రజల దృష్టి మళ్లించేందుకే కమ్యూనిస్టులపై విమర్శలు చేయడం దురదృష్టకరమన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలే లేకపోతే ఎనిమిది గంటల పనిదినం, కనీస వేతనాలు, భూసంస్కరణలు ఉండేవి కావని గుర్తు చేశారు. దేశాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ, ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తూ, యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే విధానాలకు మద్దతు ఇచ్చే వారు కమ్యూనిస్టులను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. ప్రజా సమస్యలపై చర్చించలేని వారు చరిత్రపై దాడులు చేయడం మానుకోవాలని, కమ్యూనిస్టు ఉద్యమాలపై ఎలాంటి దుష్ప్రచారం జరిగినా యువత గట్టిగా తిప్పికొడుతుందని ఆయన హెచ్చరించారు.

# రెండోరోజూ అమరావతిలో నారాయణ పర్యటన

## వాగుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

## వర్షాకాలం నీటి జాగ్రత్తలపై మంత్రి సూచనలు

**అమరావతి,జూన్4(తెలంగాణ వీణ):**

వర్షాకాలం దృష్ట్యా రాజధాని అమరావతిలో వాగుల అభివృద్ధి పనులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. వాగుల అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. పురపాలక శాఖ మంత్రి పి నారాయణ రెండోరోజు గురువారం రాజధాని అమరావతిలో పర్యటించారు. కొండవీటి వాగు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎన్-9,8,7రోడ్లలో కొండవీటి వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జిల పనుల పురోగతిపై ఆరా తీశారు. బ్రిడ్జిల కింద కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకం లేకుండా మట్టి తొలగించాలని అధికారులను ఆదేశించారు. కొండవీటి వాగు వెడల్పు తక్కువగా ఉన్నచోట మరింత వెడల్పు చేయాలని సూచించారు. నీరుకొండలో నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను కూడా మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాజధానిలో ట్రంక్ రోడ్లు, బ్రిడ్జిలు, వాగుల అభివృద్ధి పనులు వేగంగా జరుగు తున్నాయని మంత్రి చెప్పారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం

## నేడు విశాఖలో టిడిపి సైకిల్ రైడ్

**అమరావతి,జూన్4( -):**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మహత్తర కార్యక్రమానికి టీడీపీ శ్రీకారం చుట్టనుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని సమాజానికి చాటిచెప్పేందుకు సైకిల్ యాత్ర చేపట్టనుందని వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రేపు బాధ్యతగా సైకిల్ వినియోగించాలని అన్నారు. విశాఖపట్నంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సైకిల్ ప్రయాణం చేయనున్నట్లు చెప్పారు. ప్రపంచం నేడు వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, తగ్గుతున్న పచ్చదనం వంటి సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. ప్రజలు కూడా సైకిల్ యాత్రలో భాగస్వాములు కావాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సైకిల్ వినియోగం వల్ల కాలుష్యం తగ్గుతుందని, ఇంధన వినియోగం తగ్గుతుందని, ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పుకొచ్చారు. చిన్న ప్రయత్నాలే పెద్ద మార్పులకు నాంది పలుకుతాయన్నారు. 'నా దేశం నా బాధ్యతలో' భాగంగా ప్రతి ఒక్కరూ ఇంధన వినియోగం తగ్గించాలన్నారు. ఇంధన సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకునే ఈసారి మహానాడును హైబ్రిడ్ విధానంలో నిర్వహించి గ్రాండ్ సక్సెస్ సాధించామని తెలిపారు. ప్రజలందరూ సైకిల్ యాత్రలో భాగస్వాములై పర్యావరణ పరిరక్షణకు 'నేను సైతం' అంటూ ముందుకు రావాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

# పర్యావరణ పరిరక్షణకు సైకిల్ వినియోగం

## ప్రజలకు చంద్రబాబు విజ్ఞప్తి

**అమరావతి,జూన్4(తెలంగాణ వీణ):**

జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు సైకిల్ వినియోగించాలని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగే ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఆ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు సైకిల్‌పై వెళ్లనున్నారు. పర్యావరణ హితమైన సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రజలు, పార్టీ నేతలతోపాటు ప్రభుత్వంలో పని చేసే వారంతా శుక్రవారం సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణకు సంకల్పం తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం. ఈ సందర్భంగా గురువారం ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఆయన ఏమన్నారంటే.. 'రేపు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అందరం కలిసి ఒక సంకల్పం చేద్దాం. భూమి మన ఇల్లు? ప్రకృతి మన జీవనాధారం. పర్యావరణాన్ని రక్షించుకోవడం మన బాధ్యత. సహజ వనరులను కాపాడుకుంటూ, గాలి, నీరు, నేలను కలుషితం కాకుండా అందరూ కృషి చేద్దాం. పచ్చదనం పెంపు, ఇంధన వనరులు పొదుపుగా వినియోగించడం అవసరం. అందులో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న సైకిళ్లు, ఈ-సైకిళ్లపై ప్రయాణిద్దాం. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటుదాం. రేపటి నా విశాఖ పర్యటనలో నేను సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను. అంతా సహకరించాలని, మంచి కార్యక్రమానికి కలిసి రావాలని కోరుతున్నాను' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# దేశానికి యువతే ప్రాణం

## యువతను తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటా

## ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ వెల్లడి

**అమరావతి,జూన్4(తెలంగాణ వీణ):**

తన రాజకీయ ప్రయాణంలో యువత పాత్రను ప్రత్యేకంగా స్మరించుకుంటూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 2008లో ప్రజారాజ్యం పార్టీ(పీఆర్పీ) యువజన విభాగం 'యువరాజ్యం' కోసం పటిష్ఠమైన యువజన విభాగం నిర్మించాలని ప్రణాళిక చేశానని తెలిపారు. జనసేన పార్టీని స్థాపించి 12 ఏళ్లలో ఎన్నో కష్టాలు, పోరాటాలను అధిగమించిన తర్వాత.. పార్టీ కార్యకర్తలు ఇప్పుడు అనుభవం, పరిణితితో నిండి, సంస్థాగత బాధ్యతలు చేపట్టడానికి, రాజకీయాలు నిర్వహించడానికి, ప్రజా సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ యువరాజ్యం యువజన విభాగానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 2005 నుంచి ఇప్పటి వరకు తనను విశ్వసించి అండగా నిలిచిన యువతకు పవన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిజాయితీ, నిబద్ధత, దేశభక్తి కలిగిన యువతను, చైతన్యవంతమైన నాయకులను తీర్చిదిద్దేందుకు తాను కృషి చేస్తానని పవన్ ప్రతిజ్ఞ చేశారు. నూతన భారత్.. జెన్‌జెడ్ తరం నుంచి అద్భుతమైన నాయకుల ఆవిర్భావానికి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. జెన్‌జెడ్ తరం.. బుజ్జగింపు రాజకీయాలు, వంశపారంపర్య రాజకీయాలు, కుల రాజకీయాలు, విభజన రాజకీయాలు, ప్రాంతీయ రాజకీయాలతో విసిగిపోయిందని అభిప్రాయపడ్డారు. ఈ తరం.. జవాబుదారీతనం గల రాజకీయాలను తీసుకురాగల నాయకుల కోసం ఎదురుచూస్తోందని చెప్పారు. అంతేగానీ, ప్రపంచ వేదికలపై భారత్‌ను బలహీనపరిచే నాయకుల కోసం కాదన్నారు. బలమైన, పటిష్ఠమైన భారత్‌ను నిర్మించగల నాయకుల కోసం జెన్‌జెడ్ యువత ఎదురుచూస్తోందని ఎక్స్ ఖాతాలో పవన్ కళ్యాణ్ పోస్ట్ చేశారు.

# హరిత ఆలోచనలతో భావి తరాలను తీర్చిదిద్దాలి

## చిన్నప్పటి నుంచే పర్యావరణంపై అవగాహన

## ప్రకృతిపై మమకారంతోనే సమాజంపై బాధ్యత

## జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,జూన్4(తెలంగాణ వీణ):**

పర్యావరణ పరిరక్షణపై చిన్నప్పటి నుంచే అవగాహన కల్పిస్తే విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ప్రకృతిని ప్రేమించడం, పర్యావరణాన్ని సంరక్షించడం వంటి విలువలు బాల్యంలోనే అలవడితే సమాజం పట్ల బాధ్యతాభావం పెరుగుతుందని పేర్కొన్నారు. నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలోని సిద్దార్థ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. డ్రీమ్ వర్క్స్ ఆర్ట్ గ్యాలరీ, ఆంధప్రదేశ్ క్రియేటివిటీ కల్చర్ కమిషన్, ఎన్.టి.ఆర్.జిల్లా అధికార యంత్రాంగం, కొమ్మారెడ్డి వెంకట సదాశివరావు సిద్దార్థ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, విజయవాడ. ఎ.పి.సర్వోదయ మండలి, రూట్ హెల్త్ ఫౌండేషన్, సర్వోదయ ట్రస్ట్, జి.ఆర్.కె.పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి, మార్పు వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి 200 మంది ప్రఖ్యాత చిత్రకారులతో ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

# అవయవ మార్పిడి చట్టానికి ఆమోదం

వివిధ రాష్ట్రాల్లో ఉన్నట్లుగానే అమలు

బీచ్ షాక్స్ పాలసీకు కేబినెట్ ఆమోదం

భీమిలీ తదితర బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా అమలు

క్వాంటమ్ వ్యాలీ భూములకు స్టాంపు డ్యూటీ మినహాయింపు

ఏవియేషన్ పాలసీ-2026కు కేబినెట్ ఆమోదం

కృష్ణా నది తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు

ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంపు

ఎపి కేబినేట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

**అమరావతి,జూన్4(తెలంగాణ వీణ):**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీ కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్న ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఆ నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ చట్టం అమలుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. 2011 కేంద్ర చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. అవయవ మార్పిడి ప్రక్రియలో పారదర్శకత, వైద్య సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే అమలులో ఉన్న విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. బీచ్ షాక్స్ పాలసీకు కేబినెట్ ఆమోదం తెలిపింది. భీమిలి, విశాఖపట్నం, శ్రీకాకుళం, చీరాల బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా ఈ పాలసీ అమలు చేయనున్నారు. గోవా, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల అనుభవాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే బీచ్ షాక్స్‌లు తెరిచి ఉంచడానికి అనుమతి ఇవ్వనున్నారు. పరిమిత రకాల మద్యం విక్రయాలకు మాత్రమే అనుమతి ఉండనుంది. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే తదుపరి విస్తరించే అవకాశం ఉంది. రాజధాని అమరావతి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఏవియేషన్, ఉపాధి, మత్స్యరంగం, పోలవరం, పారిశ్రామిక పార్కులు, పోర్టులు, పర్యాటకం వంటి వివిధ రంగాల్లోని ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి క్వాంటమ్ వ్యాలీకి కేటాయించిన భూమి రిజిస్ట్రేషన్‌పై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపును ఆమోదించింది. రాష్ట్రంలో రిజర్వాయర్ల కేజ్ కల్చర్ పాలసీ-2025 ముసాయిదాకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. మద్దువలస, యేలేరు రిజర్వాయర్లలో ఫిషిన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు కేజ్ కల్చర్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ పాలసీ-2026కు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే అగ్రిగోల్డ్ తదితర డిపాజిటర్ల కేసుల పరిష్కారం కోసం 21 పోస్టుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చిత్తూరు జిల్లాలో వ్యవసాయ శాఖ భూమిపై సోలార్ విద్యుత్ ఎ÷-లాంట్ ఏర్పాటుకు 30 ఏళ్ల లీజు ఇవ్వడానికి అనుమతి ఇస్తూ కేబినెట్ నిర్ణయిం తీసుకుంది. ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.300 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ హామీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. కృష్ణా నది తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు టెండర్లకు కేబినెట్ అనుమతి ఇచ్చింది. రాజధాని అమరావతిలో పలు నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. పోలవరం సహా వివిధ ప్రాజెక్టుల పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీలు, కార్పొరేషన్లు, గురుకులాల్లో పని చేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలనే ప్రతిపాదనపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సీపీఎస్ అమల్లోకి రాకముందు ఇచ్చిన నోటిఫికేషన్లలో ఎంపికై.. వివిధ కారణాలతో సీపీఎస్ అమలు తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి పాత పింఛను వ్యవస్థ అమలు చేయాలనే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. నెగోషియేటెడ్ సెటిల్‌మెంట్ పాలసీలో సవరణలకు కేబినెట్ ఆమోదించింది. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ ను జులై 1 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేసే ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది.







# సోషల్ మీడియాలో 'పెద్ది' మేనియా

## 'బుక్ మై షో'లో గంటకు 40వేల టికెట్స్ బుక్

ప్రస్తుతం సోషల్ మీడియాలో 'పెద్ది' మేనియా కనిపిస్తోంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా వాటిని అందుకొని హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకువచ్చిన విషయం తెలిసిందే. రిలీజ్‌కు ముందు నుంచే టికెట్ బుకింగ్స్‌లో జోరు చూపిన చిత్రం విడుదల అనంతరం కూడా అదే కొనసాగిస్తోంది. ప్రముఖ టికెట్ బుకింగ్ యాప్ 'బుక్ మై షో'లో 'పెద్ది'కు గంటకు 40వేల టికెట్స్ బుక్ అవుతున్నాయి. 2023లో బుక్‌మై షో ప్రవేశపెట్టిన 'అవర్లీ ట్రెండింగ్' ఫీచర్ తర్వాత.. ఈ 40 వేల మార్క్‌ను దాటిన చిత్రాల జాబితాలో ఇప్పటివరకు మూడు సినిమాలు మాత్రమే ఉన్నాయి. కల్కి 2898 ఏడీ, సలార్, పుష్ప తర్వాత స్థానంలో 'పెద్ది' నిలిచింది. మొదటిరోజే ఈ మార్క్‌ను చేరుకొని రికార్డు సృష్టించింది. కర్ణాటకలో జరిగిన ప్రీమియర్ షోల ద్వారా 'పెద్ది' భారీ వసూళ్లను సాధించి, టాలీవుడ్‌లోని పలు అగ్రహీరోల చిత్రాల రికార్డులను తిరగరాసింది. ప్రీమియర్స్‌లో రూ.3.2 కోట్లు వసూలు చేసినట్లు సినీ వర్గాలు తెలిపాయి. దీంతో అక్కడ ప్రీమియర్ కలెక్షన్స్ సాధించిన మొదటి తెలుగు సినిమాగా నిలిచింది. గతంలో విడుదలైన 'ఓజీ' (రూ.2.72 కోట్లు), 'రాజా సాబ్' (రూ.2.61 కోట్లు), పుష్ప 2 (రూ.2.55 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించిన ఈ సినిమాలో పాటలు కూడా సూపర్ హిట్‌గా నిలిచాయి. ముఖ్యంగా 'చికిరి చికిరి' పాట విడుదలైన రెండు వారాలకే 10 కోట్లకు పైగా వ్యూస్‌తో ట్రెండింగ్‌లో నిలిచింది. అయితే, ఈ పాట లిరిక్స్‌లో 'సరుకూ సామాన్లు' అనే పదంపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేయడంతో టీమ్ ఈ పదాన్ని మార్చినట్లు తెలుస్తోంది. థియేటర్లలో దీనికి బదులుగా 'సొగసు సింగారం' అని చేర్చారని నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. ఈ స్పోర్ట్స్ డ్రామాకు ఏఆర్ రెహమాన్ సంగీతం హైలైట్‌గా నిలిచింది



# నా మనసంతా పెద్ది చుట్టే తిరుగుతోంది

## పొలాచ్చి లో ఉండిపోవడంతో రాలేక పోయా


## పెద్ది విజయంపై చిరంజీవి అభినందనలు

తాను షూటింగ్ నిమిత్తం పొల్లాచిలో ఉన్నా తన మనసంతా 'పెద్ది' దగ్గరే ఉందని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' నేడు ప్రేక్షకుల ముందుకువచ్చి విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఒక తండ్రిగా, నటుడిగా తనకెంతో గర్వంగా ఉందంటూ చిరంజీవి పోస్ట్ పెట్టారు. ఈసందర్భంగా చిత్రబృందాన్ని అభినందించారు. నేను షూటింగ్ నిమిత్తం పొల్లాచిలో ఉన్నా కూడా నా మనసంతా 'పెద్ది' దగ్గరే ఉంది. గత రెండేళ్లుగా ఈ సినిమా కోసం చరణ్ పడిన కష్టం, పెట్టిన శ్రద్ధాసక్తులు అన్నీ దగ్గర నుంచి చూశాను. ఈ రోజు ప్రేక్షకుల ప్రేమ, ప్రశంసలు చూస్తుంటే ఒక తండ్రిగా మాత్రమే కాదు, ఒక నటుడిగా కూడా ఎంతో గర్వంగా అనిపిస్తోంది. 'పెద్ది' పాత్రలో పూర్తిగా లీనం కావడానికి తను అహర్నిశలు చేసిన కృషి, పట్టుదల, నిజాయతీ ప్రతి సన్నివేశంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ కష్టానికి దక్కిన ప్రతిఫలమే ఈ విజయం అని రామ్ చరణ్‌ను చిరంజీవి ప్రశంసించారు. ఇలాంటి అద్భుతమైన కథను రాసి, అంతే అద్భుతంగా తెరపై ఆవిష్కరించిన దర్శకుడు బుచ్చిబాబుకు ప్రత్యేక అభినందనలు. అలాగే తన తొలి చిత్రాన్నే ఇంత భారీ స్థాయిలో, ఎలాంటి రాజీ లేకుండా నిర్మించిన నిర్మాత వెంకట సతీశ్ కిలారుకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో నటించిన నా మిత్రుడు, 'కరునాడ చక్రవర్తి' శివరాజ్ కుమార్‌కు, అప్పలసూరి పాత్రలో అద్భుతంగా జీవించిన నా సోదర సమానుడు జగపతిబాబుకు అభినందనలు. అద్భుతమైన పాటలు, హృదయాన్ని కదిలించేలా నేపథ్య సంగీతాన్ని అందించిన ఏఆర్ రెహమాన్‌కు ప్రత్యేక అభినందనలు. ఈ సినిమా విజయంలో భాగమైన జాన్వీ కపూర్ , దివ్యేందుతో పాటు సాంకేతిక నిపుణులందరికీ కంగ్రాట్స్..' అంటూ చిత్రబృందాన్ని అభినందించారు. 'పెద్ది' సాధించిన ఈ ఘన విజయం తెలుగు సినిమాకి గర్వంగా నిలవాలని, మరెన్నో మైలురాళ్లు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.



# పెద్ది థియేటర్‌లో ఉపాసన హంగామా

తన ఆటలతో అభిమానులకు ఫుల్ ట్రీట్ ఇచ్చాడు రామ్ చరణ్. ఆయన హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' థియేటర్‌లలో సందడి చేస్తోంది. ఈ చిత్రం ప్రీమియర్స్‌లో రామ్ చరణ్ భార్య ఉపాసన ఎంజాయ్ చేశారు. హైదరాబాద్ బాలానగర్‌లో స్పెషల్ స్క్రీనింగ్‌కు వచ్చిన ఉపాసన , అభిమానుల మధ్య సినిమా చూసి వారిలో ఉత్సాహం నింపారు. రామ్ చరణ్ ఎంట్రీ సమయంలో పేపర్‌లు ఎగరేసి జోష్ పెంచారు. ఫ్యాన్స్‌తో పాటు ఆమె కూడా ఉత్సాహంగా అరుస్తూ కనిపించారు. ప్రస్తుతం ఈ వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఇక పెద్ది హిట్ టాక్ రావడంతో థియేటర్‌ల వద్ద పండగ వాతావరణం నెలకొంది. రామ్ చరణ్ నటనను ప్రశంసిస్తూ సెలబ్రిటీలు పోస్టులు పెడుతున్నారు. కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందంటూ అభినందిస్తున్నారు.



# శ్రీవారిని దర్శించుకున్న జాన్వీకపూర్


తిరుమల శ్రీవారిని సినీ నటి జాన్వీ కపూర్ దర్శించుకున్నారు. బుధవారం అలిపిరి మెట్ల మార్గం ద్వారా తిరుమలకు చేరుకున్న జాన్వీ.. గురువారం ఉదయం నటి మహేశ్వరితో కలసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. అంతకుముందు తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. జాన్వీ కపూర్, రామ్‌చరణ్ జంటగా నటించిన 'పెద్ది' ఇవాళ విడుదలైన విషయం తెలిసిందే.

# త్వరలోనే ఇరుముడి థీమ్ సాంగ్ విడుదల




మాస్ మహారాజా రవితేజ, డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ 'ఇరుముడి' నుంచి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఒక సాలిడ్ అప్‌డేట్ వచ్చేసింది. ఇప్పటికే ఈ మూవీ నుంచి గ్లింప్స్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి ఒక ప్రత్యేకమైన సాంగ్ అప్‌డేట్‌ను మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా పంచుకున్నారు. గత కొన్ని రోజులుగా అభిమానుల నుంచి వస్తున్న భారీ రిక్వెస్ట్‌లను పరిగణనలోకి తీసుకుని, ఈ సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ 'ఇరుముడి' థీమ్ సాంగ్‌ను త్వరలోనే విడుదల చేయబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ పాట 'విల్లాది వీరుడు వీర మణికంఠుడు' అనే పవర్‌ఫుల్ అయ్యప్ప స్వామి భక్తి గీతంగా ఉండబోతోందని తెలుస్తుంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, ఇందులో రవితేజ ఒక ఎమోషనల్ తండ్రి పాత్రలో సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. కూతురి కోసం ఒక తండ్రి పడే తపన, మద్యపానానికి దూరమై అయ్యప్ప దీక్ష స్వీకరించి ఆధ్యాత్మిక మార్గంలో సాగే ఒక ఎమోషనల్ అండ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా కథాంశం ఉండబోతోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా, బేబీ నక్షత్ర రవితేజ కూతురిగా కీలక పాత్ర పోషిస్తోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ఆగస్టులో థియేటర్లలోకి రానుంది.

# ప్రశాంత్ నీల్‌కు ఎన్టీఆర్ బర్త్‌డే విషెస్




ఇండియన్ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ పుట్టినరోజు సందర్భంగా అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత్ నీల్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని, అలాగే వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోయే డ్రాగన్ సినిమాను గుర్తుచేస్తూ.. ఎన్టీఆర్ పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ట్వీట్‌లో ఎన్టీఆర్ స్పందిస్తూ.. 'పుట్టినరోజు శుభాకాంక్షలు డైరెక్టర్ గారూ.. మీరు చెప్పే కథలంత గొప్పగా ఈ ఏడాది మీకు సాగాలని కోరుకుంటున్నాను. మన కాంబినేషన్‌లో రాబోయే ప్రాజెక్ట్ కోసం, మన భవిష్యత్తు ప్రయాణం కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను ప్రశాంత్ అంటూ ఎన్టీఆర్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌లో ప్రశాంత్ నీల్‌ను ఉద్దేశించి ఎన్టీఆర్ కన్నడ పదం 'అవరే' (గారూ) అని సంబోధించడం ఇరు భాషల అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి ఇండస్ట్రీ హిట్ చిత్రాలతో సంచలనం సృష్టించిన ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో రాబోయే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ డ్రాగన్ పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం జూన్ 11న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

# వైభవ్ సూర్యవంశీకి టీమిండియా పిలుపు?



ఐపీఎల్ వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీని టీమిండియాలోకి తీసుకురావాలనే వాదన చాలా బలంగా వినిపిస్తోంది. లెజెండ్రీ క్రికెటర్ల దగ్గర నుంచి సామాన్య అభిమాని వరకూ వైభవ్ టీమిండియాలోకి రావాలనే కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బీసీసీఐ కూడా అటువైపు అడుగులు వేస్తోంది. సూర్యవంశీకి జాతీయ జట్టులో చోటు కల్పించాలని అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ కూడా తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా సూర్యకుమార్ యాదవ్ స్థానంలో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటిదార్‌ను ఆడించాలని చూస్తోంది. టీమిండియా టీ20 వరల్డ్‌కప్ అందించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ శకం ఇక దాదాపు ముగిసినట్టే. ఇప్పటికే సూర్యకుమార్ యాదవ్‌ను టీమిండియా టీ20 కెప్టెన్‌గా తొలగిస్తున్నారనే వార్తలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఆ ప్లేస్‌లో సర్పంచ్ సాబ్ శ్రేయాస్ అయ్యర్‌ను నూతన కెప్టెన్‌గా నియమిస్తున్నారని కూడా తెలుస్తోంది. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2024, 2026లో వరుసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్.. ఇప్పుడు మూడోసారి టైటిల్ గెలిచి రికార్డు సృష్టించాలని ఉంది. దాంతో టీ20 వరల్డ్‌కప్ 2028 టార్గెట్‌గా బీసీసీఐ అడుగులు వేస్తోంది. ఆ క్రమంలోనే సూర్యకుమార్ యాదవ్‌ను తప్పించనున్న బీసీసీఐ.. యువ ఆటగాళ్లు, అనుభవం ఉన్న ప్లేయర్లతో జట్టును సిద్ధం చేయాలని ఫిక్స్ అయినట్టుంది. ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీతో పాటు రెండుసార్లు ఆర్సీబీని ఛాంపియన్‌గా నిలిపిన రజత్ పటిదార్‌ను టీ20 జట్టులోకి తీసుకురావాలని బీసీసీఐ ప్లాన్ చేస్తోంది. కేవలం 15 ఏళ్ల వయస్సులోనే జాతీయ జట్టులో చోటు కల్పించడం సరైనదేనా? అనే చర్చ జరుగుతున్నప్పటికీ.. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ మాత్రం సూర్యవంశీకి టీమిండియా క్యాప్ అందించాలని చాలా సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను పూర్తిగా తొలగిస్తే అతని స్థానంలో నెంబర్ 4లో రజత్ పటిదార్‌ను ఆడిస్తే బాగుంటుందేమో అని బీసీసీఐ పరిశీలిస్తోంది. పటిదార్ కెప్టెన్సీలో ఆర్సీబీ వరుసగా రెండు ఐపీఎల్ టైటిల్స్ గెలవడమే కాకుండా.. కెప్టెన్ ధోనీ, రోహిత్ శర్మ సరసన కూడా నిలిచాడు. దాంతో పాటు ఐపీఎల్ 2026లో కెప్టెన్‌గా సక్సెస్ కావడమే కాకుండా 192.69 స్ట్రయిక్ రేట్‌తో 501 పరుగులు కూడా చేసి సత్తా చాటాడు. టీమిండియాలోకి వైభవ్‌ను వీలైనంత త్వరగా తెచ్చేందుకు బీసీసీఐ చాలా ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే సూర్యవంశీని ఈ నెలలో శ్రీలంకలో జరగనున్న ఇండియా – ఏ, అఫ్ఘనిస్థాన్ – ఏ, శ్రీలంక – ఏ మధ్య జరగనున్న ట్రై సిరీస్‌కు కూడా స్క్వాడ్‌లో సెలెక్ట్ చేశారు. ఈ సిరీస్‌లో వైభవ్ తన సత్తా చాటితే రానున్న కాలంలో టీమిండియాలో అడుగుపెట్టడం ఖాయమనే చెప్పొచ్చు.

# రోహిత్, కోహ్లీ వన్డే సిరీస్ ఆడతారా? ఫిట్‌నెస్‌పై కొనసాగుతున్న సస్పెన్స్




అఫ్ఘానిస్థాన్‌తో జూన్ 13 నుంచి ప్రారంభం కానున్న 3 వన్డేల సిరీస్‌లో భారత స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడతారా లేదా అనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. గాయాల కారణంగా వీరిద్దరూ దూరమవుతున్నారంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై భారత అసిస్టెంట్ కోచ్ టెన్ డస్కటే స్పందించారు. ఫిట్‌నెస్ ప్రోటోకాల్స్ అందరికీ ఒకేలా ఉంటాయని, వైద్య బృందం నివేదిక ఆధారంగా త్వరలోనే అధికారిక నిర్ణయం ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు. టీమిండియా స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ , రోహిత్ శర్మ .. ప్రస్తుతం టెస్ట్, టీ20లకు గుడ్‌బై చెప్పి కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్‌లో ఆడటమే లక్ష్యంగా వీరిద్దరూ అడుగులు వేస్తున్నారు. ఇక స్వదేశంలో జూన్ 13 నుంచి అఫ్ఘానిస్థాన్‌తో భారత్ వన్డే సిరీస్‌లో ఆడనుంది. మొత్తంగా మూడు వన్డే మ్యాచ్‌లు ఈ సిరీస్‌లో జరుగుతాయి. ఇందుకోసం ఎంపిక చేసిన జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ రోహిత్, కోహ్లీలు ఈ సిరీస్‌లో ఆడేది అనుమానంగా మారింది.ధర్మశాల వేదికగా తొలి వన్డే జరగనుంది. శుభమన్ గిల్ నాయకత్వంలో భారత జట్టు ఈ సిరీస్‌లో తలపడనుంది. అయితే గాయాల కారణంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. వన్డే సిరీస్‌కు దూరమవుతారనే ప్రచారం జరుగుతోంది. దీనిపై రకరకాల వార్తలు వస్తున్నాయి. రోహిత్ దూరమయ్యాడని.. కోహ్లీ ఆడతాడా లేడా అనేది తేలాల్సి ఉందని సోషల్ మీడియాలో నెటిజన్లు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో భారత అసిస్టెంట్ కోచ్ టెన్ డస్కటే ఈ విషయంపై అప్‌డేట్ ఇచ్చాడు. "బయట ఎలాంటి చర్చ జరిగినా అనవసరం. అధికారికంగా మేం త్వరలోనే సమాచారం ఇస్తాం. విరాట్ కోహ్లీ లేదా రోహిత్ శర్మ వంటి పెద్ద ఆటగాళ్లు సిరీస్‌లో ఆడకపోవడం బిగ్ న్యూస్ అవుతుందని తెలుసు. ఫిట్‌నెస్‌కు సంబంధించి ప్రోటోకాల్స్ అందరికీ ఒకేలా ఉంటాయి. సిరీస్ ప్రారంభానికి ఇంకొంత సమయం ఉంది. ఆలోగా మేం నిర్ణయం తీసుకుంటాం. ఫిట్‌గా ఉంటే తుది జట్టులో ఉంటారు. లేకపోతే అందుకు తగినట్టుగా మార్పులు చేసుకుంటాం. వైద్య బృందం నిర్ణయం తర్వాత.. ఆయా ఆటగాళ్ల పరిస్థితిపై అధికారికంగా స్పందిస్తాం" అని టెన్ డస్కటే చెప్పాడు.

### వన్డే సిరీస్ కోసం భారత జట్టు..

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, అర్ష్‌దీప్ సింగ్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గూర్నూర్ బ్రార్, హర్ష్ దూబె.

# హర్మన్‌ప్రీత్ ఖాతాలో మరో వరల్డ్ రికార్డు

క్రికెట్ అంటేనే ఇండియా పేరు మార్మోగిపోతోంది. అది ఏ ఫార్మెట్ కాని.. రికార్డులు తిరగరాస్తున్నారు. భారత మెన్ క్రికెట్ జట్టుతో సమానంగా విమెన్ క్రికెట్ జట్టు కూడా పటిష్టంగానే ఉంది. ఇక భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ప్రపంచ రికార్డు సృష్టించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన క్రీడాకారిణిగా హర్మన్‌ప్రీత్ కౌర్ సరికొత్త చరిత్ర లిఖించారు. ఇప్పటి వరకు న్యూజిలాండ్ క్రీడాకారిణి సుజీ బేట్స్ (367 మ్యాచ్‌లు) ఆడి టాప్ ప్లేసులో ఉండగా.. ఇంగ్లండ్‌లోని టాంటన్‌లో మంగళవారం జరిగిన మూడో టీ20 మ్యాచ్ తర్వాత హర్మన్‌ప్రీత్ కౌర్ కెరీర్‌లో 368వ అంతర్జాతీయ మ్యాచ్ పూర్తి చేసుకుంది. దీంతో న్యూజిలాండ్ ప్లేయర్ పేరుతో ఉన్న రికార్డును అధిగమించారు. ఈ జాబితాలో సుజీ బేట్స్ రెండో స్థానంలో ఉండగా ఆస్ట్రేలియాకు చెందిన ఎల్లీస్ పెర్రీ (357 మ్యాచ్‌లు) మూడో స్థానంలో కొనసాగుతున్నారు. 2009లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన 37 ఏళ్ల హర్మన్‌ప్రీత్ పంజాబ్‌కు చెందిన ఆల్‌రౌండర్. ప్రస్తుతం విమెన్ టీమిండియా జట్టు సారధిగా ఉంది. ఇప్పటివరకు 7 టెస్టులు, 164 వన్డేలు, 197 టీ20 మ్యాచ్‌లు ఆడారు. ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను భారత్ 1-2 తేడాతో కోల్పోయినప్పటికీ నిర్ణయాత్మకమైన ఆఖరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ హాఫ్ సెంచరీతో రాణించడం విశేషం. 2025లో భారత జట్టుకు తొలిసారిగా మహిళల ప్రపంచకప్ అందించిన కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ అరుదైన ఖ్యాతిని సొంతం చేసుకుంది. అంతే కాదు విమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ముంబై ఇండియన్స్‌కు పలు టైటిళ్లు సాధించిపెట్టిన భారత మహిళల క్రికెట్ సారధిగా ఆమెకు మంచి గుర్తింపు ఉంది. ఇక ఆట పరంగా చూసుకుంటే కూడా కౌర్ బ్యాటింగ్, బౌలింగ్ తో పాటు కెప్టెన్సీని కూడా సమర్ధవంతంగా పోషిస్తూ ఆల్‌రౌండర్ ప్రతిభను చాటుకుంటోంది. హర్మన్‌ప్రీత్ కౌర్ అరుదైన ఘనత సాధించడంపై సహచర క్రీడాకారులు, జట్టు ప్రధాన కోచ్ అభినందనలు తెలిపారు. మహిళల క్రికెట్‌లో అంతర్జాతీయ మ్యాచ్‌ల సంఖ్య పెరుగుతున్న ఈ రోజుల్లో ఆమె స్థిరత్వం, అంకితభావానికి ఈ రికార్డు నిదర్శనమని క్రీడా వర్గాలు ప్రశంసిస్తున్నాయి.





# వైభవ్‌కు ఎక్కడ బంతి వేయాలో కూడా అర్థం కాలేదు

## సన్‌రైజర్స్ స్టార్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ 2026 నుంచి బయటకు రావడానికి ఏకైక కారణం వైభవ్ సూర్యవంశీ. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైభవ్ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. కేవలం 29 బంతుల్లోనే 97 పరుగులతో ఊచకోత కోశాడు. అయితే, ఆ రోజు బౌలర్లకు వైభవ్‌కు ఎక్కడ బంతి వేయాలో కూడా అర్థం కాలేదని.. అలాంటి ఆటను తానెప్పుడూ చూడలేదంటూ సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్ ఓ పోడ్‌కాస్ట్‌లో చెప్పాడు. ఐపీఎల్ 2026లో వైభవ్ సూర్యవంశీ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. ముఖ్యంగా ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కి కాళ రాత్రి మిగిల్చాడు. ఆ రాత్రి సూర్యవంశీ బాదే బాదుడుకు బంతి ఎక్కడ వేయాలో కూడా బౌలర్లకు అర్థం కాలేదని సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ప్లేయర్ మళ్లీ గుర్తు తెచ్చుకున్నాడు. 15 ఏళ్ల ఈ బుడ్డోడు క్రికెట్ చరిత్రలో గుర్తుండిపోయే ఇన్నింగ్స్‌లు ఆడాడు. ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ – రాజస్థాన్ రాయల్స్ ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ కేవలం 29 బంతుల్లోనే 97 పరుగులు చేశాడు. ఐపీఎల్ ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు బ్రేక్ చేస్తారని అందరూ ఊహించారు. వైభవ్ విధ్వంసానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇంటిదారి పట్టాల్సి వచ్చింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగి క్వాలిఫయర్ 2లో కూడా వైభవ్ 96 పరుగులతో రాణించడం విశేషం. అయితే, సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 12 సిక్సర్లు బాదిన వైభవ్ బౌలర్లకు చుక్కలు చూయించాడని సన్‌రైజర్స్ ప్లేయర్ లియామ్ లివింగ్‌స్టోన్ అన్నాడు. తన కెరీర్‌లో ఏడు ఐపీఎల్ సీజన్‌లు ఆడానని.. ఎంతో మంది మంచి ప్లేయర్లను చూశానని.. కానీ ఇలాంటి ప్లేయర్‌ను మాత్రం చూడలేదంటూ ఓ పోడ్‌కాస్ట్‌లో షాకింగ్‌గా చెప్పాడు. "నా కెరీర్‌లో ఇలాంటోడిని చూడలేదు. ఏడు సీజన్‌లుగా నేను ఐపీఎల్‌లోనే ఉన్నాను. నేను ఎంతో మంది మంచి ప్లేయర్లతో ఆడాను, కానీ ఇలాంటి ఆటగాడిని మాత్రం చూడలేదు. అతడు బంతిని కొట్టే విధానమే వేరు, చాలా క్లీన్‌గా షాట్లు ఆడతాడు. నిజం చెప్పాలంటే అతడు బంతిని రాంగ్‌గా ఆడటం చాలా అరుదనే చెప్పొచ్చు. టోర్నమెంట్ మొత్తం చూసినా మిస్ హిట్ చేసిన సందర్భాలు దాదాపు లేవు. మొదటి సారి మేము బౌన్సర్‌తో అతడిని ఔట్ చేశాం. తొలి బంతికే అతడు బంతిని నేరుగా గాల్లోకి లేపాడు. కానీ, టోర్నమెంట్ ప్రారంభం నుంచి చివరి వరకు అతని ఆటలో వచ్చిన మార్పు చాలా అద్భుతం. మేము బౌన్సర్ వేస్తే థర్డ్ మ్యాన్ మీదుగా బౌండరీ కొట్టేవాడు. ఈ వైపు బంతి వేస్తే అటు కొట్టేవాడు. ఫుల్ లెంగ్త్ వేస్తే మరో వైపు పంపేవాడు. లో ఫుల్‌టాస్ వేస్తే కూడా గ్యాప్‌ల్లోకి పంపించేవాడు. అప్పుడు మాకు ఎక్కడ బౌలింగ్ చేయాలి అనేది ఒక్క నిమిషం అర్థం కాలేదు" అంటూ లియామ్ లివింగ్‌స్టోన్ స్టిక్ టు క్రికెట్ పోడ్‌కాస్ట్‌లో అన్నాడు. వైభవ్ సూర్యవంశీ 776 పరుగులతో ఐపీఎల్ 2026 సీజన్‌లో అత్యధిక పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు.



# వైభవ్ పై మనసుపారేసుకున్న రిద్ధిమా పాఠక్

సమరంలో వీరోచితమైన ఆట తీరు ప్రదర్శించి వరల్డ్ వైడ్‌గా ఫేమస్ అయిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తన నిర్భయమైన బ్యాటింగ్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. వైభవ్ సాధించిన విజయాలు దేశీయంగా, అంతర్జాతీయంగా అన్నిచోట్లా ప్రశంసలు అందుకుంటున్నాయి. ఇటీవల, 2026 ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న అతి పిన్న వయస్కుడైన ఆటగాడిగా వైభవ్ నిలిచాడు.రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడిన వైభవ్ 16 మ్యాచ్‌లలో ఐదు అర్ధశతకాలు, ఒక శతకంతో సహా 776 పరుగులు సాధించాడు. స్పోర్ట్స్ యాంకర్ రిద్ధిమా పాఠక్ వైభవ్ అద్భుత ప్రదర్శనను ప్రశంసిస్తూ, అతడిని బీహార్ అతిపెద్ద బ్రాండ్ అంబాసిడర్ అని అభివర్ణించారు. దీనికి సంబంధిన వీడియోని కూడా ఇన్‌స్టాలో పోస్ట్ చేయడంతో వైరల్ అవుతోంది.వైభవ్ సూర్యవంశీ బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లా తాజ్‌పూర్ గ్రామానికి చెందినవాడు. అతను బీహార్ తరపున దేశీయ క్రికెట్ ఆడతాడు. అయితే ఈసారి ఐపీఎల్‌లో తన విజృంభణ చూపించడంతో పిల్లాడు కాస్తా క్రికెట్ పిడుగు అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. క్రికెట్ లెజెండ్స్, సెలబ్రిటీలు సైతం ఈ కుర్రాడి ఆటతీరు, రికార్డులు బద్దలు కొట్టడంపై స్పందించారు. బీహార్‌కు అంతర్జాతీయంగా కీర్తిని తెచ్చిపెట్టిన వైభవ్ గురించి తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో రిద్ధిమా పాఠక్ ఇంట్రెస్టింగ్ కామెంట్ చేశారు. చిన్నప్పుడు స్కూల్లోనూ, కాలేజీలోనూ 'మీరు ఎక్కడి నుండి వచ్చారు?' అని మమ్మల్ని అడిగినప్పుడు, మేము బీహార్ వాసులమని చెప్పడానికి సంకోచించేవాళ్ళమని కాని ఇప్పుడు గర్వంగా ఉందని చెప్పుకొచ్చింది. ఎందుకంటే లాలూ ప్రసాద్ యాదవ్ బీహార్‌కు అలాంటి ఇమేజ్ ఏదీ ఇవ్వలేదు. కానీ ఆ తర్వాత రెండు అద్భుతమైన విషయాలు జరిగాయి. మొదటిది మహేంద్ర సింగ్ ధోని, రెండవది, 'గ్యాంగ్స్ ఆఫ్ వాస్సేపూర్' సినిమా. ఈ రెండూ బీహారీలలో కొంత ఉత్సాహాన్ని నింపాయి.కానీ దీని వల్ల వచ్చిన మంచి ప్రచారం మొత్తం బీహార్ నుండి విడిపోయి కొత్త రాష్ట్రంగా ఏర్పడిన జార్ఖండ్‌కు చేరిందని పాఠక్ తెలిపారు. అయితే ఇప్పుడు ముందుకు వచ్చిన వ్యక్తి వైభవ్ సూర్యవంశీ. అతను పూర్తిస్థాయి బీహారీ. ఇప్పుడు తాను బీహారీ అని చెప్పుకోవడానికి ఏ బీహారీ కూడా సిగ్గుపడటం లేదని గర్వపడుతున్నామని చెప్పుకొచ్చింది. ఆమె మాటల్లో ఆనందం, ముఖంలో గర్వం చూస్తుంటే వైభవ్ సూర్యవంశీని విపరీతంగా అభిమానిస్తున్నట్లుగా కనిపిస్తోంది. స్పోర్ట్స్ యాంకర్ రిధిమా పాఠక్ ఎవరు..?రిధిమా పాఠక్ స్వస్థలం జార్ఖండ్. ఆమె తండ్రి పేరు సురేష్ కుమార్ పాఠక్, ఆయన సైన్యంలో పనిచేశారు. రిధిమా ఒక సుప్రసిద్ధ స్పోర్ట్స్ యాంకర్ , ప్రజెంటర్. ఆమె అనేక ఐసీసీ ఈవెంట్లలో యాంకరింగ్ చేస్తూ కనిపించారు.ఆమె విద్య విషయానికి వస్తే రిధిమా రాంచీలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి, ఆ తర్వాత పూణే నుండి ఎలక్ట్రానిక్స్ , టెలికమ్యూనికేషన్స్‌లో ఇంజనీరింగ్ డిగ్రీని పొందారు. అయితే సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే రిధిమా పాఠక్ సెలబ్రిటీలతో జరిపిన ఇంటర్వ్యూలు, ఫోటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.స్పోర్ట్స్ యాంకర్ కాకముందు ఆమె ఒక కార్పొరేట్ ఉద్యోగంలో చేశారు.

Edited & Printed by:Vulloju Srinivas Published & Owned by:Shabari Media HousePlot No. 596/B, Defence Colony Malkajgiri, Medchal District Telangana, India
RNI No.: TGTEL/25/A4103 Contact:Mobile: 9848588616 Email: vsrinivasetv@gmail.com